
తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
# ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సంపుటి: 2 | సంచిక: 206 | మంగళవారం 17–12–2024 | పేజీలు: 08 | వెల: 5 | www.telanganamuchatlu.in

## 7 లేదా 10 ఎకరాలకే
# రైతు భరోసా !

- ప్రభుత్వానికి కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సు
- ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్ 1 ఆఫీసర్లకు రద్దు
- గతంలో మాదిరి రాళ్లురప్పలు, చెట్టుపుట్టలు, రోడ్లకు ఇవ్వొద్దు
- కేవలం సాగు భూములకేఇవ్వాలని సూచనలు



**రైతు భరోసాకు తప్పనిసరిగా లిమిట్ పెట్టాలని ప్రభుత్వానికి కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సు చేసింది. గతంలో మాదిరి దుబారా జరగకుండా, పక్కా నిబంధనలతో పథకాన్ని అమలు చేయాలని సూచించింది. రైతు భరోసాపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది.**

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
''రైతు భరోసా అమలుపై అభిప్రాయ సేకరణ చేపట్టాం. ఎన్ని ఎకరాలు ఉంటే అంతకు పెట్టుబడి సాయం అక్కర్లేదని, పరిమితి పెట్టాలని సూచనలు వచ్చాయి. ఎక్కువ శాతం మంది రైతులు ఏడు, ఏడున్నర ఎకరాల వరకు లిమిట్ పెట్టాలన్నారు. కొంతమంది 10 ఎకరాలు, ఇంకొంత మంది 5 ఎకరాల వరకే ఇవ్వాలన్నారు'' అని తెలిపింది. రాష్ట్రంలోని భూకమతాలను పరిశీలిస్తే 5 ఎకరాల వరకు ఉన్న చిన్న, సన్నకారు రైతులే 90 శాతానికి పైగా ఉన్నారని చెప్పింది. అలాగే ప్రజాప్రతినిధులు (ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు), ఐఏఎస్, ఐపీఎస్ లతో పాటు గ్రూప్ 1 ఆఫీసర్లకూ రైతు భరోసా ఇవ్వాల్సిన అవసరం లేదని సిఫార్సు చేసింది.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా కింద ఎకరాకు రూ.7,500 ఇవ్వాల్సి ఉందని కేబినెట్ సబ్ కమిటీ పేర్కొంది. ''గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు కింద ఎకరాకు రూ.5 వేలు ఇచ్చారు. అది ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎకరాలకు (పార్టీ మినహా) ఇచ్చారు. దీంతో ప్రతి సీజన్కు యావరేజ్గా రూ.7,600 కోట్లు ఖర్చయింది. మరోవైపు చెట్టుపుట్టలు, రాళ్లురప్పలు, హైవేలు, రోడ్లు, వెంచర్లకు, భూ సేకరణ కింద పోయిన భూములకు కూడా గత ప్రభుత్వం రైతు బంధు జమ చేసింది. దీంతో వేల కోట్లు వృథా అయ్యాయి. ఇక మీదట ఆ పొరపాట్లు జరగకుండా పక్కాగా సాగు భూములకే రైతు భరోసా అందించాలి. టెక్నాలజీని వాడుకుని ఏ సర్వే నెంబర్ భూముల్లో ఏయే పంటలు వేశారో శాటి లైట్, డిజిటల్ సర్వేలతో గుర్తించి పెట్టుబడి సాయం అందించాలి' అని ప్రభుత్వానికి సబ్ కమిటీ సూచించింది.

**సీజన్ కు రూ.7,500 కోట్లు..**
వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం.. ఈ వానాకాలం సీజన్లో 1.39

మిగతా 2లో



# హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోలేదు..

- ఏపీకి పోతుంది అనేది ప్రచారం మాత్రమే!
- హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోయిందన్నది తప్పుడు ప్రచారం మాత్రమే..
- ఏపీలో చంద్రబాబు రాగానే అక్కడికి పోతోందనేది ప్రచారమే..
- హైదరాబాద్, బెంగళూరుకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు.-మంత్రి పొంగులేటి

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోలేదని.. చంద్రబాబు రాగానే ఏపీకి పోతుంది అనేది ప్రచారం మాత్రమేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. అమరావతిలో వరద వల్ల ఏపీకి ఇన్వెస్ట్మెంట్ వెళ్లే పరిస్థితి లేదన్నారు. అమరావతిలో వరద వల్ల ఇన్వెస్ట్మెంట్ పెట్టే వాళ్లకు భయం పట్టుకుందని మంత్రి అన్నారు. మీడియా చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడారు. హైదరాబాద్ - బెంగుళూరుకు ఇన్వెస్టర్లు వస్తున్నారన్నారు. హైడ్రా భయం ప్రజల్లో మాత్రం లేదన్న ఆయన.. మొదట్లో తప్పుడు ప్రచారం జరిగినా ఇప్పుడు నిజం తెలిసిందన్నారు. అప్పులపై కేటీఆర్, బీఆర్ఎస్ నిజాలు తెలుసుకోవాలన్నారు. కార్పొరేషన్ లోన్స్‌తో కలిపి మొత్తం లెక్కలను బీఆర్ఎస్ వాళ్లు బయటపెట్టాలన్నారు. కార్పొరేషన్ పేరుతో చేసే అప్పులు సైతం ప్రభుత్వం ఖాతాలోకి వస్తాయి

మిగతా 2లో

## సంక్రాంతి తర్వాత
# కొత్త రేషన్ కార్డులు..

- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం



**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
కొత్త రేషన్ కార్డుల జారీపై కేబినెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని కేబినెట్ సమావేశంలో చర్చించిన అనంతరం ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో గత దశాబ్ద కాలంగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయక పోవడంతో లక్షలాది మంది ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని సర్కారు నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. రేషన్ కార్డు అర్హతలు, విధివిధానాలు, వార్షిక ఆదాయ పరిమితిపై మంత్రివర్గ ఉప సంఘం ఇప్పటికే చర్చించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాలు రేషన్‌కార్డుతో ముడిపడి ఉన్నవే. తెల్ల రేషన్‌కార్డు ఉంటేనే ప్రభుత్వ పథకాలు పొందడానికి అర్హులు అవుతారు. దీంతో చాలా మంది రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్నారు.
పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ ఎస్ సర్కారు.. కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంపై దృష్టి పెట్టలేదు. 2018 ముందస్తు ఎన్నికల సమయంలో రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించి అప్లికేషన్లు ఆహ్వానించింది. దీంతో అప్పట్లో పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. అయితే, 2021 నాటికి కొందరికి మాత్రం ఆహార భద్రత కార్డులు మంజూరు చేసింది. ఆ తర్వాత పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. కుటుంబాలు, కుటుంబ సభ్యులు పెరుగుతున్నా.. కార్డులు జారీ చేయలేదు. చనిపోయినవారి పేర్లను జాబితా నుంచి తొలగించారే కానీ కొత్తగా వారిని చేర్చలేదు. దీంతో పలు

మిగతా 2లో

## ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండానే
# ముగిసిన బిఏసి సమావేశం

- బీఆర్ఎస్, ఎంఐఎం వాకౌట్



**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
విపక్షాల నిరసన, వాకౌట్ మధ్య అసెంబ్లీలో జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ బీఏసీ సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే అజెండాతో మధ్యాహ్నం స్పీకర్ ఛాంబర్‌లో భేటీ ప్రారంభమైంది. అయితే సమావేశం నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం వాకౌట్ చేశాయి. ఆ పార్టీల తరపున సమావేశానికి వచ్చిన హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, అక్బరుద్దీన్ వాకౌట్ చేశారు. బీఏసీ లేకుండానే 2 బిల్లులు, చర్చ పెట్టడం సంప్రదాయ విరుద్ధమని హరీశ్ రావు మండిపడ్డారు.బయటకు వచ్చిన తరువాత హరీశ్ రావు ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. బీఏసీ లేకుండానే 2 బిల్లులు ప్రవేశపెట్టి, చర్చ పెట్టడం సంప్రదాయ విరుద్ధమని, కనీసం బీఏసీ మీటింగ్‌లో ఎన్ని రోజులు సభ నడుపుతారో కూడా స్పష్టంగా చెప్పడం లేదన్నారు. సభ కనీసం 15 రోజులు నడపాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాత్రం 3, 4 రోజులు సభ నడుపుతామని చెబుతోందని ఇలా అయితే ప్రజా సమస్యలపై చర్చ ఎలా సాధ్యమని ప్రశ్నించారు.
**రోజూ జీరో అవర్ ఉండాలి :** అసెంబ్లీలో ప్రభుత్వ ఆంక్షలపై కూడా హరీశ్ రావు మండి పడ్డారు. తొలిరోజు టీ షర్టులతో వస్తే ఎందుకు ఆపారని మీటింగ్‌లో నిలదీశామని హరీశ్‌రావు తెలిపారు. టీషర్టుతో పార్లమెంటుకు రాహుల్ వెళ్లట్లేదా అని ప్రశ్నించారు. లగచర్ల రైతులకు బేడీలపై చర్చించాలంటే స్పందించట్లేదన్నారు. సభలో పర్యాటకం కంటే లగచర్ల రైతులపై చర్చే ముఖ్యమని చెప్పామన్నారు. ప్రతి రోజూ జీరో అవర్ ఉండాలని కోరినట్లు హరీశ్‌రావు తెలిపారు.
**అది స్పీకర్ నిర్ణయిస్తారు :** అయితే ఈ ఆరోపణలను డిప్యూటీ సీఎం

మిగతా 2లో



## ఈ నెల 18న టీపీసీసీ ఆధ్వర్యంలో
# చలో రాజ్‌భవన్

- 18న టీపీసీసీ ఆధ్వర్యంలో చలో రాజ్‌భవన్
- పాల్గొననున్న సీఎం రేవంత్, డిప్యూటీ భట్టి, ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, తదితరులు.

మిగతా 2లో

## భూములు ఇవ్వకపోతే
# జైల్లో పెడతారా ?

- శాసన సభ నడిచినన్ని రోజులు లగచర్ల ఘటనపై కొట్లాడుతాం..
- ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పే వరకు పోరాటం చేస్తాం
- అసెంబ్లీ నడిచినన్ని రోజులు లగచర్ల ఘటనపై కొట్లాడుతాం.-కేటీఆర్




**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
అప్పులపై రాష్ట్ర ప్రభుత్వం సభను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం చెప్పిన అబద్ధాలు ఆర్బీఐ నివేదికలో తేటతెల్లమైందన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సభను తప్పుదోవ పట్టిస్తున్నారని సభాహక్కుల ఉల్లంఘన కింద నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులపై వాస్తవాలను సరి చేసుకుంటే ఇబ్బందేమీ లేదన్నారు. గతంలో సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి నోటీసులిస్తే అప్పటి స్పీకర్ చర్చకు అనుమతి ఇచ్చారని కేటీఆర్ గుర్తు చేశారు. ''ఎమ్మెల్యే ప్రొటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్‌కు ఫిర్యాదు చేశాం. ప్రభుత్వ కార్యక్రమాలకు కాంగ్రెస్ ఇంఛార్జ్‌లను పిలుస్తున్నారు.. మా ఎమ్మెల్యేలను పిలవడం లేదు. వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనపై ప్రత్యేక చర్చ జరపాలని స్పీకర్‌ను కోరాం. 'మా భూమి మేము ఇవ్వం' అన్న పాపానికి లగచర్ల రైతులను జైల్లో పెట్టారు. భూములు ఇవ్వకపోతే జైల్లో

మిగతా 2లో



## వన్ నేషన్
# వన్ ఎలక్షన్ రావాలి..

- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కీలక వ్యాఖ్యలు..

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ రావాలని ఎమ్మెల్యే అన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనేది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే బీఆర్ఎస్ ది కాదని క్లారిటీ ఇచ్చారు. అసెంబ్లీ మీడియా పాయింట్ లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. బీఏసీలో చర్చ జరగకుండా అసెంబ్లీలో ఎజెండా ఎలా పెడతారు? అని ప్రశ్నించారు. టూరిజం మీద చర్చ కాదు..లగచర్ల బాధితుల మీద చర్చ పెట్టాలన్నారు. రేవంత్ రెడ్డి కి ఓటు వేసినందుకు లగచర్ల వాసులకు బేడీలు వేశారని

మిగతా 2లో

# పెండింగ్ బిల్లులు చెల్లించరా..?

- అసెంబ్లీలో సర్పంచుల పెండింగ్ బిల్లులపై వాడి వేడి చర్చ
- మీరు పెండింగ్‌లో పెట్టిన అప్పులే మేము కడుతున్నామన్న మంత్రి సీతక్క
- నెల నెలా బిల్లులు చెల్లిస్తే బకాయిలు ఉండవని హరీష్ రావు కౌంటర్..



**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా కొనసాగుతున్నాయి. ప్రశ్నోత్తరాల సమయంలో సభలో అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. ముందుగా ప్రశ్నోత్తరాల కార్యక్రమం ప్రారంభం కాగానే బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు సర్పంచ్ల బిల్లుల చెల్లింపుపై ప్రశ్నించారు. దీనిపై మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు.. కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదోవ పట్టిస్తోందని హరీశ్ రావు విమర్శించారు. సర్పంచ్లకు బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని మండిపడ్డారు. బిల్లులు రాక సర్పంచ్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. బంగారాన్ని తాకట్టు పెట్టి సర్పంచ్లు పనులు చేశారని చెప్పారు. తెచ్చిన అప్పులకువీజీసీ వడ్డీ కట్టలేని దీన స్థితిలో సర్పంచ్లు ఉన్నా రనిఅన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం 15వ ఆర్థిక సంఘం నుంచి వచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. ఏకంగా ఒక్క నెలలోనే బడా కాంట్రాక్టర్ లకు 1200 కోట్లు చెల్లించారని హరీశ్ సభ దృష్టికి తెచ్చారు.. ఇప్పటికే 691 కోట్లు సర్పంచ్ లకు ఇవ్వాల్సి ఉందన్నారు. గ్రామ పంచాయతీలను బలోపేతం చేస్తామని చెప్పిన మాటలు ఏమ య్యాయని ప్రశ్నించారు. గత 9 నెలలుగా గ్రామ పంచాయతీ ఉద్యోగులకు, సర్పంచ్ లకు జీతాలు లేవని చెప్పారు. బిల్లులు, జీతాలను ఎప్పటిలోగా క్లియర్ చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ లను అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. తెలంగాణ పల్లెలను కేసీఆర్ దేశానికే ఆదర్శంగా నిలిపారని హరీశ్ రావు కొనియాడారు. గ్రామాలను కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని

మిగతా 2లో

# 7 లేదా 10 ఎకరాలకే రైతు భరోసా !

**మొదటి పేజీ తరువాయి**

కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో వరి, పత్తి పంటలే ఎక్కువ మొత్తంలో ఉన్నాయి. ఏ రైతు ఎన్ని ఎకరాల్లో ఏయే పంటలు వేశారో ఏఈఓలు ఇప్పటికే ఆన్ లైన్ లో నమోదు చేశారు. ఒకవేళ ప్రభుత్వం మొత్తం సాగైన భూములకు ఎకరాకు రూ.7,500 చొప్పున రైతు భరోసా ఇస్తే.. సీజన్ కు దాదాపు రూ.10 వేల కోట్లు అవసరమవుతాయని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. అలా కాకుండా సీలింగ్పెట్టినా, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఇన్కమ్ ట్యాక్స్పేయర్స్ లాంటి వాళ్లను మినహాయించినా.. ఈ మొత్తం తగ్గుతుందని అంటున్నారు. నిబంధనలు పక్కాగా అమలు చేస్తే సరాసరి గతంలో ఇచ్చినంతనే రూ.7,500 కోట్లు సరిపోతాయని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈసారి వ్యవసాయేతర భూములకు ఎట్టి పరిస్థితుల్లోనూ రైతు భరోసా ఇవ్వకూడదని



ప్రభుత్వం నిర్ణయించింది. సాగు భూముల లిస్టులో నుంచి నాన్అగ్రికల్చర్ భూములను తీసేయనుంది. ఇలా కనీసం 15 లక్షల ఎకరాలు తీసేసే చాన్స్ఉన్నట్టు తెలిసింది. దీంతో దాదాపు రూ.1,300 కోట్ల నుంచి రూ.1,500 కోట్ల దుబారాను అడ్డుకునే అవకాశం ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగులో లేని రాళ్లురప్పలు, గుట్టలకు, వెంచర్లకు, ఇండ్లకు, హైవేలకు, రోడ్లకు ఇతరత్రా వాటికి రైతు బంధు కింద ఏకంగా రూ.20 వేల కోట్లకు పైగా చెల్లించినట్టు తెలుస్తున్నది.

**అసెంబ్లీలో చర్చించి నిర్ణయం..**

కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సులపై అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది.కమిటీ సూచనల మేరకు ఎన్ని ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలి? ఎవరెవరికి ఇవ్వాలి?అనే దానిపై ప్రతిపక్షాల సలహాలు, సూచనలు తీసుకోనుంది. ఆ తర్వాతే రైతు భరోసా విధివిధానాలు ఖరారు చేయనున్నట్టు తెలుస్తున్నది. కాగా, సంక్రాంతి తర్వాత రైతు భరోసా జమ చేస్తామని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.



## పెండింగ్ బిల్లులు చెల్లించరా..?

**మొదటి పేజీ తరువాయి**

చెప్పా రు. కాంగ్రెస్ హయాంలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి సీతక్క సమాధానం చెబుతూ, 2014 నుంచి మీరు పెట్టిన బకాయిలే అంటూ ఎత్తిపొడిచారు. మీరు ఆర్థిక మంత్రిగా ఉండి కూడా సర్పంచ్ బిల్లులపై ఎందుకు సంతకం పెట్టలేదని నిలదీశారు. బిఆర్ఎస్ పార్టీ అంటే బకాయిల రాష్ట్ర సమితి అంటూ వ్యాఖ్యనించారు.. మీరు పెట్టిన బకాయిలే క్రమ పద్దతిలో చెల్లింపులు చేస్తున్నామని మంత్రి చెప్పారు. ఖాళీ ఖజనా, బకాయిలు మా చేతిలో పెట్టి వెంటనే చెల్లించమంటే ఎలా అంటూ హరీశ్ ను ప్రశ్నించారు... కాగా నెల నెలా బిల్లులు చెల్లిస్తే అసలు బకాయిలు ఉండవని పల్లె ప్రగతి క్రింద గతంలో తమ ప్రభుత్వం ఇలాగే విడుదల చేసిందని హరీష్ రావు మంత్రి సీతక్కకు తిరిగి కౌంటర్ వేశారు....కాగా పల్లె ప్రగతి నిధులు విడుదల చేయకపోవడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని సీతక్క వివరించారు.. అయితే సీతక్క సమాధానం పట్ల సంతృప్తి చెందని బిఆర్ఎస్ సభ్యుల సభ నుంచి వాకౌట్ చేశారు

## ఈ నెల 18న టీపీసీసీ ఆధ్వర్యంలో చలో రాజ్‌భవన్

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**



ఈ నెల 18న టీపీసీసీ ఆధ్వర్యంలో చలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ నెల 18వ తేదీ బుధవారం నాడు ఉదయం 11 గంటలకు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద భారీ జన సమీకరణతో రాజ్ భవన్ వరకు ప్రదర్శనగా 'చలో రాజ్ భవన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇంచార్జ్ దీపా దాస్ మున్షి , మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పాల్గొననున్నారు. అమెరికాలో గౌతమ్ అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకలు దేశ వ్యాపార, ఆర్థిక రంగాలలో పరువును దెబ్బతీసాయి. అదానీపై ఆర్థిక అవకతవకలు, నేరారోపణలు, అవినీతి, మోసం, మని లాండరింగ్, మార్కెట్ మానిపులేషన్ లాంటి అంశాలలో ఆయనపై ఆరోపణలు దేశ ప్రతిష్టను దెబ్బతీసాయి. మణిపూర్‌లో వరసగా జరిగిన అల్లర్లు, విధ్వంసాలపై మోడీ ఇప్పటి వరకు అక్కడకు వెల్లకపోవడంలాంటి అంశాలపై ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం నాడు చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు.



## అనుమానం ఉంటే.. హ్యాక్ చేసి చూపించండి..

- **అబ్దుల్లా బాటలో బెనర్జీ**

ఈవీఎం ల పనితీరుపై వ్యక్తమవుతోన్న అనుమానాలను తోసిపుచ్చే విపక్ష పార్టీల జాబితాలో తృణమూల్ కాంగ్రెస్ కూడా చేరింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన ప్రతిసారి విపక్షపార్టీలు ఈవీఎం లపై అనుమానాలు వ్యక్తం చేస్తుంటాయి. ఇటీవల హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో ఓటమి చవిచూసిన తర్వాత వాటిపై పలు ప్రశ్నలు లేవనెత్తాయి. ఈ క్రమంలో ఇండియా కూటమిలోని మరోపార్టీ ఆ అనుమానాలను తోసిపుచ్చింది. తాజాగా తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, జనరల్ సెక్రటరీ అభిషేక్ బెనర్జీ మాట్లాడుతూ.. ''ఈవీఎం లపై అనుమానాలు వ్యక్తం చేసేవారు.. వాటిని ఎలా హ్యాక్ చేయొచ్చో ఎన్నికల సంఘానికి చూపించాలి. కేవలం ఆరోపణలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదు'' అని హితవు పలికారు. దీనిపై కేంద్రమంత్రి, భాజపా నేత సతీశ్ చంద్ర దూబే స్పందించారు. తృణమూల్ నేత ఆలస్యంగానైనా నిజాన్ని అర్థం చేసుకున్నారని వ్యాఖ్యలు చేశారు. ''ఇటీవల జమ్మూకశ్మీర్, ఝార్ఖండ్‌లో ఎన్నికలు జరిగాయి. ఆ రెండు చోట్లా ఇండియా కూటమిలో భాగమైన పార్టీలే విజయం సాధించాయి. అప్పుడు ఈ ఆరోపణలు ఏవీలేవు. అబద్ధాలపై పొత్తు ఎక్కువ కాలం నిలబడదు'' అని విమర్శలు చేశారు.

ఇదిలా ఉంటే, దీనికిముందు జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ..''పార్లమెంటులో వందమందికి పైగా సభ్యులు అదే ఈవీఎంలతో మీ పార్టీ తరపున నెగ్గినప్పుడు దానిని ఘన విజయంగా తీసుకున్నారు. కొన్ని నెలల తర్వాత మీరు అనుకున్న ఫలితాలు రాకపోయేసరికి ఈవీఎంలను నిందిస్తున్నారు. పక్షపాతంతో కాకుండా సిద్ధాంతాల ఆధారంగానే నేను మాట్లాడుతున్నా. ఓటింగు విధానంపై విశ్వాసం లేనప్పుడు ఎన్నికల్లో పోటీ చేయకూడదు. ఈవీఎంలతో ఏదైనా సమస్య ఉంటే దానిపై పోరాటం చేయాలి. ఫలితాలకు ఈవీఎంలతో సంబంధం లేదు. ఓటర్లు ఒకసారి మనల్ని ఎన్నుకుంటారు. మరోసారి ఎన్నుకోరు. నేనే దీనికి ఉదాహరణ. లోక్‌సభ ఎన్నికల్లో నేను ఓడిపోయాను. సెప్టెంబరులో అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ సాధించాను. యంత్రాలను నేనెప్పుడూ ఆడిపోసుకోలేదు'' అని కాంగ్రెస్‌ను ఉద్దేశించి అన్నారు.

దీనిపై కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ అభ్యంతరం తెలిపారు. ఎన్నికల్లో ఈవీఎంలను ఉపయోగించడం వల్ల అవకతవకలు జరిగినట్లు ఆరోపించినది ఇండియా మిత్రపక్షాలైన సమాజ్‌వాదీ పార్టీ, ఎన్సీపీ (ఎస్పీ), శివసేన (యూబీటీ) నేతలే అని ఆయన పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ తీర్మానం ఎన్నికల కమిషన్ గురించి మాత్రమే ప్రస్తావించిందని అన్నారు. ఒమర్ అబ్దుల్లా తాను ఎదుర్కొన్న వాస్తవాలను గుర్తుంచుకొని మాట్లాడాలని.. తన వైఖరిని మార్చుకోవాలని సూచించారు. ఇన్నాళ్లు కూటమిలో ఒకరిగా ఉన్న ఒమర్ ముఖ్యమంత్రి అయ్యాక భాగస్వాములతో ఈవిధంగా ఎందుకు ప్రవర్తిస్తున్నారు అని ప్రశ్నించారు.

## హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోలేదు..

**మొదటి పేజీ తరువాయి**



అనేది కేటీఆర్ తెలుసుకోవాలన్నారు. 7లక్షల 20వేల కోట్లు తెలంగాణ రాష్ట్రానికి అప్పులు ఉన్నాయన్నారు. శాసన సభలో ఎవరి పాత్ర వారిదే.. ప్రివిలేజ్ మోషన్ ఇవ్వడం వాళ్ల హక్కు అంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా కొసరుతో కొట్లాడుతున్నారన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఆయన సభలో కూర్చొని ఉండగా.. మాట్లాడాలనే కోరిక తనకు ఉందన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్‌లో ఆదాయం పెరుగుతోందన్నారు. కాంగ్రెస్ ఏడాది కాలంపై ఎలాంటి వ్యతిరేకత లేదని... వైఎస్ఆర్ సమయంలో కూడా ఇలానే ప్రచారం జరిగిందన్నారు. రెండు మూడు ఏళ్లలో అన్ని సర్దుకున్నాయని.. వర్షాలు బాగా పడ్డాయన్నారు. అదానీ విషయంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ పాలసీనే రాష్ట్రంలో అమలు జరుగుతుందన్నారు.

భూమి లేని నిరుపేదలకు రూ.12000 ఇవ్వడం వల్ల సుమారు 15 లక్షల కుటుంబాలకు లబ్ది చేకూరనుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. 1000 కోట్లు విడుదల చేసే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. సంక్రాతికి రైతు భరోసా, ఆసరా పెన్షన్ల విడుదలకు యత్నిస్తున్నామన్నారు. గత రెండు మూడు సంవత్సరాల నుంచి పోల్చుకుంటే స్థాంప్స్ &రిజిస్ట్రేషన్ ఆదాయం పెరిగిందన్నారు. గత మూడు నెలల నుండి రియల్ ఎస్టేట్ పెరిగిందని మంత్రి వెల్లడించారు.

## భూములు ఇవ్వకపోతే జైల్లో పెడతారా?

**మొదటి పేజీ తరువాయి**

పెడతారా? జైల్లో రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. రైతుల బాధలు సమస్యలు కావా? అక్కడి రైతులు ఇబ్బంది పడుతుంటే పర్యాటకంపై చర్చ అవసరమా? సీఎం ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు.. ఒక్కపైసా తేలేదు. ప్రశ్నించిన వారిని జైలుకు పంపుతున్నారు. లగచర్ల ఘటనపై అసెంబ్లీలో చర్చ పెట్టకుండా రేవంత్ రెడ్డి పారిపోయారు. రాష్ట్రంలో ఉన్నది ప్రజా ప్రభుత్వం కాదు.. అరాచక ప్రభుత్వం. కొడంగల్ ప్రజల తరపున భారాస, కేసీఆర్ ఉన్నారు. రైతుల తరపున మేం పోరాటం చేస్తాం'' అని కేటీఆర్ తెలిపారు.




## వన్ నేషన్ వన్ ఎలక్షన్ రావాలి..

**మొదటి పేజీ తరువాయి**

మండిపడ్డారు. వాళ్ళు ఏమి తప్పు చేశారో రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి అల్లుడు, అదానీ కోసం భూములు గుంజుకుంటున్నారన్నారు. హరి నాయక్ కు గుండె పోటు వస్తే కుటుంబ సభ్యులకు కూడా సమాచారం ఇవ్వలేదన్నారు.

హరి నాయక్ కు ఏమైనా అయితే ఎవరు బాధ్యులన్నారు. హరి నాయక్ కు గుండె పోటు వస్తే అంబులెన్స్ లో కాకుండా పోలీస్ వాహనంలో హాస్పిటల్ కు తీసుకు వెళ్లారని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తెలిపారు. సభలో లగచర్ల రైతుల మీద చర్చ చేయాలని డిమాండ్ చేశారు. టూరిజం మీద చర్చ ఏముంది కేవలం ఢిల్లీ, జైల్ టూరిజం మాత్రమే రాష్ట్రంలో జరుగుతున్నాయన్నారు. పదుల సార్లు సీఎం ఢిల్లీకి వెళ్ళారు కానీ ఒక్క రూపాయి కూడా తీసుకు రాలేదన్నారు. టెర్రరిజం నడిపినట్టు రాష్ట్రంలో పాలన నడుస్తుందని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సభలో రుణమాఫీ, రైతు భరోసా, లగచర్ల మీద చర్చ చేయాలన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ రావాలని జనాలు కోరుకుంటున్నారన్నారు. 2027 లో ఎన్నికలు రావాలని కోరుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ రావాలి అనేది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే బీఆర్ఎస్ ది కాదన్నారు. వచ్చే ఎన్నికల్లో పట్నం నరేందర్ రెడ్డి రేవంత్ రెడ్డిని చిత్తు చిత్తు ఓడగొడుతారన్నారు.

## మళ్లీ అధికారంలోకి వస్తామన్న నమ్మకం కేసీఆర్‌కు లేదు..

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

ఐదుగురు ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా భట్టి విక్రమార్క రోజూ సభకు వచ్చారని.. 38 మంది ఉన్న బీఆర్ఎస్ నాయకుడు కేసీఆర్ ఎందుకు రావడం లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ముఖ్యమంత్రి కంటే ఎక్కువ విలువ ప్రతిపక్ష నాయకుడికి ఉంటుందన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ఖతం అవుతుంది అని కేసీఆర్ ముందే తెలుసుకొని సభకు రావడం లేదన్నారు. అసెంబ్లీ లాబీల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో చిట్ చాట్‌లో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తామన్న నమ్మకం కేసీఆర్‌కు లేదని.. అందుకే అసెంబ్లీ వస్తలేరు అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. కొడుకు , అల్లుడు , బిడ్డలను తాము పట్టించుకోమన్నారు. డీలిమిటేషన్‌లో 34 అసెంబ్లీ సీట్లు, 7 ఎంపీ సీట్లు పెరుగుతాయన్నారు. జమిలి డ్రాఫ్ట్ రెడీ అయిందన్నారు. మా సీఎం , మంత్రులు పబ్లిక్‌కి అందుబాటులో ఉంటున్నాము ప్రతిపక్ష హోదా లేకున్నా ఖర్గే, అదిర్ రంజన్ చౌదరి పార్లమెంట్‌కి వెళ్లారన్నారు. బడ్జెట్ సమావేశాల వరకు కొత్త మంత్రివర్గం రెడీ అవుతుందని ఆయన వెల్లడించారు.కాంగ్రెస్‌లో మంత్రి వర్గ విస్తరణలో ఎవరికి పదవులు అనేది ఎవరు చెప్పలేరన్నారు. ఈ విషయం పార్టీ అధిష్ఠానం, సీఎందే తుది నిర్ణయమన్నారు. పాలమూరు నుంచి శ్రీహరికి కచ్చితంగా మంత్రి పదవి.. ఇది మాత్రం చెప్పగలనన్నారు. నల్గొండలో 2018లో భూపాల్ రెడ్డిని వికలాంగుడు అనే సానుభూతితో గెలిపించారంటూ మంత్రి విమర్శించారు. ఇందిరా గాంధీ, ఎన్టీఆర్ ఓడారు.. నేనెంత అంటూ వ్యాఖ్యానించారు. కల్వకుర్తిలో ఎన్టీఆర్ మీద చిత్త రంజన్ ఇంట్లో నుంచి గెలిచారన్నారు. తన మీద గెలిచేందుకు బూర నర్సయ్య రూ.80 కోట్లు ఖర్చు పెట్టారని.. అయినా తానే గెలిచానన్నారు. ప్రతిపక్ష ఎంపీగా ఎన్నో రోడ్ ప్రాజెక్టులు తీసుకొచ్చామన్నారు. గడ్కరీ నిన్న సీఎంకు చెబుతూ.. వెంకన్న నాకు చోటా బాయ్ అన్నారన్నారు.



## ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండానే ముగిసిన బిఏసి సమావేశం

**మొదటి పేజీ తరువాయి**

భట్టి విక్రమార్క ఖండించారు. అసెంబ్లీ నిబంధనల మేరకే బీఏసీ జరిగిందని స్పష్టం చేశారు. బీఏసీలో బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు సరిగ్గాలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అసెంబ్లీ లాబీలో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. అసెంబ్లీ ఎన్ని రోజులు నడుపాలన్నది స్పీకర్ నిర్ణయిస్తారని, ఈ విషయం పదేళ్లు పాలించిన వారికి ఇది తెలియదా అంటూ ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి హరీష్‌రావు చెప్పినట్లు సభ పనిదినాలు ఉండాలంటే ఎలా అని ప్రశ్నించారు. తాను ఎల్‌వోపీగా ఉన్నప్పుడు గత ప్రభుత్వం ఇలాగే చేసిందన్న విషయం తనకు తెలియదా అన్నారు. ఇప్పుడు కూడా సభ ఎన్ని రోజులు జరపాలో స్పీకరే నిర్ణయిస్తారని తేల్చి చెప్పారు.

## సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు..

**మొదటి పేజీ తరువాయి**

సంక్షేమ పథకాల విషయంలో అర్హులైన అనేక మందికి లబ్ధి చేకూరలేదు.

ప్రజా పాలనలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం డిసెంబర్ 28, 2023 నుంచి జనవరి 6, 2024 మధ్య అప్లికేషన్లను స్వీకరించింది. అయితే ఆరు గ్యారంటీల కంటే కూడా రేషన్ కార్డుల కోసం అప్లై చేసుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంది. దీంతో రేషన్ కార్డుల జారీపై కాంగ్రెస్ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఆరు గ్యారంటీలతో పాటు ఇతర సంక్షేమ పథకాలకు రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకోవడంతో ప్రజల నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలన్న డిమాండ్ పెరగడంతో అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులను ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రేషన్ కార్డుల పంపిణీకి కేబినెట్ కూడా నిర్ణయం తీసుకుంది. రేవంత్ సర్కార్ చూపుతున్న చొరవతో.. కొత్త రేషన్ కార్డుల కోసం ఏండ్ల తరబడి



ఎదురు చూస్తున్న వారి నిరీక్షణకు తెరపడనుంది.

## వాక్ స్వాతంత్ర్యాన్ని అణిచివేసిందే కాంగ్రెస్

- ఇప్పుడు రాజ్యాంగం గురించి మాట్లాడుతున్నరు
- కుటుంబ కోసం రాజ్యాంగం మార్చిన చరిత్ర కాంగ్రెస్ ది
- కాంగ్రెస్ చేసిన సవరణలు రాజ్యాంగం బలోపేతానికి కాదు
- కుటుంబం, అధికారం కాపాడుకోవడానికే కాంగ్రెస్ రాజ్యాంగంలో సవరణలు చేసింది
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**ఢిల్లీ ,తెలంగాణ ముచ్చట్లు:**

భారత రాజ్యాంగం 75వ ఏదారిలోకి అడుగుపెట్టిన సందర్భంగారాజ్యసభలో సోమవారం ప్రత్యేక చర్చ జరుగుతోంది. అధికార పక్షం తరపున కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ చర్చను ప్రారంభించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. కుటుంబం కోసం రాజ్యాంగాన్నే మార్చివేశారని విమర్శించారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత దాదాపు 50 దేశాలకు స్వాతంత్ర్యం లభించింది. అవి రాజ్యాంగాన్ని రచించుకున్నాయి.కాలక్రమంలో పలు దేశాలు తమ రాజ్యాంగం అసలు ఉద్దేశాన్ని మార్చివేశాయి. కానీ మన రాజ్యాంగం మాత్రం కాలపరీక్షలను తట్టుకొని నిలబడింది. వాక్ స్వాతంత్యాన్ని అణచివేసేందుకు కాంగ్రెస్ సవరణలు చేసింది. ఇప్పుడు మాత్రం రాజ్యాంగ పరిరక్షణ గురించి ప్రసంగాలు చేస్తోంది అని సీతారామన్ మండిపడ్డారు. ఇందిర హయాంలో విధించిన ఎమర్జెన్సీ 42వ రాజ్యాంగ సవరణ గురించి ఆమె ప్రస్తావించారు. "కాంగ్రెస్ చేసిన సవరణలు రాజ్యాంగం బలోపేతానికి కాదు. అధికారంలో ఉన్నవారిని రక్షించుకోవడానికి... కుటుంబం కోసం ఈ ప్రక్రియను ఉపయోగించారు" అని వ్యాఖ్యలు చేశారు.



ఇందిరా అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని నిలిపివేయాలని ప్రయత్నించారని భాజపా చీఫ్, కేంద్రమంత్రి కేపీ నడ్డా విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# అది భూకంపం కాదు.. సిరియాపై ఇజ్రాయెల్ దాడి..



**ఇంటర్నెట్ డెస్క్ ,తెలంగాణ ముచ్చట్లు:**

రియాలో కీలక నౌకా స్థావరమైన టార్టస్ నగరంపై ఇజ్రాయెల్ భీకరదాడి చేసింది. ఒకానొక దశలో ఇక్కడ భూమి కంపించిపోయి రిక్టర్‌స్కేల్‌పై 3.0గా ఆ ప్రకంపనలు నమోద య్యాయంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. యుద్ధాలను ట్రాక్ చేసే 'ఓఎస్ఐఎన్‌టీ డిఫెండర్' ఈవిషయాన్ని వెల్లడించింది. ఈ పేలుడును 820 కిలోమీటర్ల దూరంలోని పశ్చిమ తుర్కియే నగరమైన ఇస్నిక్‌లోని భూకంప కేంద్రం కూడా గుర్తించినట్లు డెయిలీమెయిల్ పత్రిక వెల్లడించింది. భూకంపం కంటే రెండు రెట్ల వేగంతో ఆ ప్రకంపనలు ప్రయాణించినట్లు రిసెర్చర్ రిచర్డ్ కోర్డారో వెల్లడించారు.

**రష్యా నౌకాదళ స్థావరం..**

2012 నుంచి ఇప్పటివరకు సిరియాపై ఇజ్రాయెల్ చేసిన అతిపెద్ద దాడిగా నిపుణులు పేర్కొంటున్నారు. దీని పేలుడు వల్ల పుట్టిన అగ్నిగోళం కొన్ని కిలోమీటర్ల మేరకు కనిపించింది. ఆ తర్వాత పలుమార్లు అక్కడి నుంచే పేలుడు శబ్దాలు వినిపించాయి. ఈ దాడి జరిగిన ప్రదేశంలో గగనతలం నుంచి గగనతలంలోకి క్షిపణులు ప్రయోగించినట్లు సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ వెల్లడించింది. ఈ నగరంలో భారీ స్థాయిలో రష్యా నౌకాదళానికి చెందిన ఆయుధాగారాలు కూడా ఉన్నాయి. తొలిసారి సోవియట్ సమయంలో 1971లో ఈ నగరంలో నౌకాదళ స్థావరాన్ని నిర్మించారు. ఆ తర్వాత రష్యాకు మధ్యధరా సముద్రంలో ప్రవేశించేందుకు ఉన్న ఏకైక మార్గం ఇదే. ఇక సిరియా అంతర్యుద్ధంలో బషర్ సర్కారుకు మద్దతుగా రష్యా ఈ మార్గంలోనే ఆయుధాలను సరఫరా చేసేది. 2017లో ఆ దేశ ప్రభుత్వం రష్యాకు 49 లీజుకు ఉచితంగా మాస్కోకు ఇచ్చింది. దీనికి 250 కిలోమీటర్ల దూరంలోని ముప్పును కూడా గ్రహించేలా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ఇక్కడ ఏర్పాటుచేశారు.

ఇటీవల బషర్ సర్కారు కూలిపోవడం.. రెబల్స్‌తో అమెరికా విదేశాంగశాఖ నేరుగా టచ్‌లో ఉండటంతో.. రష్యా ఈ స్థావరాన్ని ఖాళీ చేస్తోంది. గత వారం ఇక్కడ ఐదు రష్యా యుద్ధ నౌకలను గుర్తించారు. ఇవి తిరుగు ప్రయాణం అవుతున్నట్లు తెలుస్తోంది.

**గోలన్‌హైట్స్‌పై ఇజ్రాయెల్ దృష్టి..**

ఇజ్రాయెల్ ఉత్తర భాగంలోని గోలన్‌హైట్స్‌లో జనాభాను పెంచాలని నెతన్యాహు సర్కారు నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం 11 మిలియన్ డాలర్లను కేటాయించేందుకు మంత్రి వర్గం ఆమోద ముద్ర వేసింది. 1967లో సిక్స్‌డే వార్ సందర్భంగా ఇజ్రాయెల్ ఈ భూభాగాన్ని సిరియా నుంచి ఆక్రమించుకొంది. నాటి నుంచి ఇరు దేశాల మధ్య దీనిపై హక్కు కోసం వివాదం నెలకొంది. 2019లో గోలన్ ప్రాంతాన్ని ఇజ్రాయెల్‌లో భాగంగా అమెరికా గుర్తించింది. ఇక తాజాగా బషర్ సర్కారు కూలిపోవడంతో.. ఇజ్రాయెల్ దళాలు సిరియా భూభాగాల్లోకి చొచ్చుకెళ్లాయి.



# బంగ్లాదేశ్ ఎన్నికలు.. యూనస్ కీలక ప్రకటన

**ఇంటర్నెట్ డెస్క్ ,తెలంగాణ ముచ్చట్లు:**

రాజకీయ అనిశ్చితిలో ఉన్న బంగ్లాదేశ్ ఎన్నికలపై తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది చివర్లో కానీ, 2026 ప్రారంభంలో కానీ సార్వత్రిక ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు స్టేట్ టెలివిజన్‌తో మాట్లాడారు. బంగ్లాలో ఈ ఏడాది జనవరిలో ఎన్నికలు జరిగాయి. అప్పుడు మళ్లీ విజయం సాధించిన షేక్ హసీనా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. ప్రతిపక్ష పార్టీలు ఆ ఎలక్షన్‌కు దూరంగా ఉండటంతో ఆమె నేతృత్వంలోని అవామీ లీగ్‌కు సునాయాసంగా గెలుపు దక్కింది. ఆ ఎన్నికలు జరిగిన తీరు అంతర్జాతీయ ఆందోళనకు దారితీసింది. ఇక ఆ తర్వాత రిజర్వేషన్లపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో వందల మంది ప్రాణాలు కోల్పోయారు. దాంతో హసీనా తన పదవికి రాజీనామా చేయాల్సివచ్చింది. ఆందోళనలు తీవ్రంగా ఉండటంతో ఆమె దేశం విడిచి, భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందుతున్నారు. ఆమె రాజీనామాతో బంగ్లాలో అవామీలీగ్ ప్రభుత్వం పడిపోయింది. ప్రస్తుతం మహమ్మద్ యూనస్ సారథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం కొనసాగుతోంది. ఎన్నికల సంస్కరణలు, ఓటర్ల జాబితా తయారీల ఆధారంగా తేదీని నిర్ణయిస్తామని తెలిపారు.

# 80 కోట్ల మంది పేదరికంలో ఉన్నట్లేగా..

- '70 పని గంటల'పై నారాయణమూర్తి వ్యాఖ్యలు



**కోల్‌కతా ,తెలంగాణ ముచ్చట్లు:**

అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ చేరాలంటే దేశ యువత వారానికి 70 గంటలు చొప్పున పని చేయాలంటూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు ఇటీవల పెద్ద చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో పారిశ్రామికవేత్తలు, టెకీలు స్పందిస్తూ భిన్నాభిప్రాయాలు వ్యక్తపర్చారు. తాజాగా ఈ పని వేళల అంశంపై మరోసారి మాట్లాడిన నారాయణమూర్తి తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. వారానికి 70 గంటలు పని చేయకపోతే దేశంలో పేదరికం ఎలా అధిగమించగలమని ప్రశ్నించారు.

కోల్‌కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో నారాయణమూర్తి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''ఇన్ఫోసిస్‌ను మేం ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ కంపెనీలతో పోలుస్తాం. అలా పోల్చుకున్నప్పుడే భారతీయులు చేయాల్సింది చాలా ఉందనిపిస్తుంది. మన దేశంలో ఇంకా 80కోట్ల మంది ఉచిత రేషన్ అందుకుంటున్నారు. అంటే ఆ 80 కోట్ల మంది ఇంకా పేదరికంలో ఉన్నట్లే కదా..! అందుకే మన ఆశలు, ఆకాంక్షలను ఉన్నతంగా ఉంచుకోవాలి. వారానికి 70 గంటలు పని చేయలేకపోతే మనం ఈ పేదరికాన్ని ఎలా అధిగమించగలం? మనం కష్టపడి పనిచేసే స్థితిలో లేకపోతే ఇంకెవరు పని చేస్తారు?'' అని నారాయణమూర్తి తెలిపారు. భవిష్యత్తు కోసం మనమంతా కలసికట్టుగా బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఆ మధ్య ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన 'ది రికార్డ్' అనే పాడ్‌కాస్ట్ తొలి ఎపిసోడ్‌లో మాట్లాడిన నారాయణ మూర్తి.. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లో ఉత్పాదకత తక్కువని అన్నారు. అందుకే దేశ యువత మరిన్ని గంటలు అధికంగా శ్రమించాలన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జపాన్, జర్మనీ వంటి దేశాలు ఎలాగైతే కష్టపడ్డాయో.. మనమూ అలా శ్రమించాలని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పనిచేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై మిశ్రమ స్పందనలు వ్యక్తమయ్యాయి. కొందరు ఉద్యోగ జీవితంలో ఉండే ఇబ్బందులను లేవనెత్తగా.. మరికొందరు బాస్‌లు మాత్రం నారాయణ మూర్తి అభిప్రాయాన్ని స్వాగతించారు.

# తెలంగాణ తల్లి రూపం మార్పుపై కొట్లాడే హక్కు భారాసకు లేదు: విజయశాంతి



**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

2007లో తల్లి తెలంగాణ పార్టీ మొదటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిందని కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి తెలిపారు. అప్పుడు విగ్రహాన్ని బీఎస్ రాములు రూపొందించారని పేర్కొన్నారు. అనంతరం కొంత కాలానికి భారాస తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిందని చెప్పారు. కానీ ఆ పార్టీ 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నా.. విగ్రహానికి అధికారిక హోదా, గౌరవం ఇవ్వలేదని విమర్శించారు. ఈమేరకు ఆమె 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పని చేసిందని చెప్పారు. భారాసకు తెలంగాణ తల్లి రూపం మార్పుపై కొట్లాడే హక్కు లేదని మండిపడ్డారు. తల్లి తెలంగాణ పార్టీ రూపొందించిన విగ్రహాన్ని గతంలో భారాస మార్చితే ఎవరైనా కొట్లాడారా..? అని ప్రశ్నించారు. మన బోనాలు, బతుకమ్మ సంస్కృతి తరతరాలుగా నిలిచే ఉన్నాయి. వాటిని రాజకీయ పార్టీల ప్రయోజనాలకు వాడుకోవద్దని విజయశాంతి హితవు పలికారు.



# విమానాల్లో నోట్ల కట్టలు కుక్కి.. సిరియా సొమ్ములు రష్యాకు ఇలా..!

**ఇంటర్నెట్ డెస్క్ ,తెలంగాణ ముచ్చట్లు:**

కొన్నేళ్లుగా అంతర్యుద్ధంలో మునిగిపోయిన సిరియా నుంచి బషర్ అల్‌అసద్ గుట్టు చప్పుడు కాకుండా భారీగా నగదును రష్యాకు తరలించారట. ఈ విషయాన్ని ఆంగ్ల వార్తాపత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ కథనంలో పేర్కొంది. 2018-19 మధ్య దాదాపు రెండు టన్నులు తూగే 100 డాలర్ల బిల్లులు, 500 యూరో నోట్లను విమానాల్లో కుక్కి మాస్కోకు తరలించారు. అప్పట్లో సిరియాపై పశ్చిమదేశాల ఆంక్షలు ఉండటంతో.. వాటిని తప్పించుకొనేందుకే ఇలా చేశారు. ఈ మొత్తం దాదాపు 250 మిలియన్ డాలర్లు (రూ.2.1వేల కోట్లు)గా అనుమానిస్తున్నారు.

**ఒత్తిడి నుంచి బయటపడేందుకు..**

సిరియా సెంట్రల్ బ్యాంక్‌కు చెందిన విమానాలు తరచూ మాస్కోలోని వ్నూకోవ్ ఎయిర్‌పోర్టుకు చేరుకొనేవి. అక్కడ రష్యా బ్యాంకుల్లో నగదు జమ చేసేవి. మార్చి 2018 నుంచి సెప్టెంబర్ 2019 మధ్యలో ఈ బదలాయింపు జరిగింది. 2019 మేలో ఒక విమానంలో దాదాపు 10 మిలియన్ డాలర్ల విలువైన నగదును పంపినట్లు గుర్తించారు. ఆ సమయంలో సిరియా ఆర్థికవ్యవస్థకు రష్యా ఊపిరి అందించినట్లైంది. 2018 నాటికి ఆంక్షల కారణంగా గ్లోబల్ ఫైనాన్షియల్ వ్యవస్థల నుంచి సిరియాను బయటకు నెట్టేశారు. దీంతో విదేశాలతో వ్యాపారం చేయాలంటే నగదు రూపంలో లావాదేవీలు జరపాల్సిన పరిస్థితి తలెత్తింది. అంతర్జాతీయ ఆంక్షలను బైపాస్ చేయడానికి ఇది బలమైన ఆయుధంగా వాడుకొన్నారు. ఆర్థిక, సైనికపరమైన సాయాలు క్రెమ్లిన్ నుంచి అందేవి. ముఖ్యంగా వాగ్నర్ కిరాయి సైన్యం అసద్ పక్షాన నిలబడటంతో.. ఆయన సిరియాపై పట్టు కొనసాగించగలిగారు. రష్యా బ్యాంకుల్లో ఒక్కసారిగా భారీ మొత్తాల్లో విదేశీ మారకద్రవ్యం డిపాజిట్లపై అమెరికా మాజీ విదేశాంగశాఖ సహాయ మంత్రి డేవిడ్ షెంకర్ స్పందించారు. అసద్ సర్కారు నుంచి ఈ సొమ్ములు వస్తున్నట్లు పేర్కొన్నారు. అసద్ తన అక్రమ సంపదను కాపాడుకోవడం.. సిరియా పరిమిత వనరులపై నియంత్రణ సాధించేందుకు ఇలా చేసినట్లు పేర్కొన్నారు. ఈ సొమ్ముతో పాలకులు, వారి కార్యవర్గంలోని వ్యక్తుల విలాసవంతమైన జీవితానికి అవసరమైన కొనుగోళ్లను చేసేవారన్నారు. అసద్ సంపదకు సంబంధించి నిర్వహణకు జేపీ మోర్గాన్ సంస్థలో పనిచేసిన ఓ మాజీ ఉద్యోగి సాయం చేసినట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక పేర్కొంది. ఇక రష్యాలోని ఫైనాన్షియల్ కార్పొరేషన్ బ్యాంక్, టీఎస్ఎంఆర్ బ్యాంక్ వీరికి సాయం చేశాయి. వీటిపై అమెరికా ఆంక్షలు విధించింది. ఇరాన్‌కు చెందిన రివల్యూషనరీ గార్డ్స్ కోర్, హెజ్‌బొల్లా నిర్వహించే కంపెనీల్లో పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. వీటిని అసద్ ఆర్థిక సలహాదారు యాసిర్ ఇబ్రహీం చూసుకొన్నట్లు కథనాలు వస్తున్నాయి.

**అసద్ కుటుంబ సంపద ఎంత..?**

అసద్ సంపద లెక్కలు ఎక్కడా కచ్చితంగా లేవు. సౌదీ పత్రిక ఎలావ్ గతంలో బ్రిటన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీని ఉటంకిస్తూ.. 200 టన్నుల బంగారం, 16 బిలియన్ డాలర్లు (రూ.1.35 లక్షల కోట్లు), 5 బిలియన్ యూరోలు (రూ.44 వేల కోట్లు) ఉన్నట్లు పేర్కొంది. మరోవైపు 2022లో అమెరికా విదేశాంగశాఖ లెక్కల ప్రకారం అసద్ ఫ్యామిలీకి 2 బిలియన్ డాలర్లు (రూ.16 వేల కోట్లు) వరకు సంపద ఉండొచ్చని అంచనా. సిరియాలో శక్తిమంతమైన వ్యాపారవేత్త రామీ మఖ్‌లౌఫ్ 2020లో అసద్ కుటుంబంతో విభేదించాడు. ఆ తర్వాత అతడి సంపదను సర్కారు స్వాధీనం చేసుకొంది. ఇందులో అసద్ కుటుంబానికి 5 బిలియన్ డాలర్లు చేరినట్లు చెప్పుకొంటారు.



# మస్క్ రూ.169 కోట్ల పందేరం.. నిజమేనా..?

**ఇంటర్నెట్ డెస్క్ ,తెలంగాణ ముచ్చట్లు:**

డీప్‌ఫేక్ వీడియోలు ప్రజలను తప్పుదోవ పట్టించడం ఇటీవల కాలంలో బాగా ఎక్కువైంది. ఓ వెబ్‌సైట్‌లో ప్రపంచ సంపన్నుడు ఎలాన్ మస్క్ 20 మిలియన్ డాలర్లు (సుమారు రూ.169 కోట్లు) విరాళం ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈమేరకు ఓ డీప్ ఫేక్ వీడియో ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. దీనిలో ఎలాన్ మస్క్ మాట్లాడుతూ ఓ వెబ్‌సైట్‌కు వ్యూయర్‌షిప్ పెంచేందుకు తాను ఈ మొత్తం ఇవ్వనున్నట్లు చెప్పారు. ''నేను 20 మిలియన్ డాలర్ల క్రిప్టోను డాట్‌కామ్‌కు వ్యూయర్‌షిప్ పెంచేందుకు ఇవ్వనున్నాను. ఇది డిసెంబర్ 13 నుంచి వారం రోజులపాటు కొనసాగుతుంది'' అని వీడియోలో పేర్కొన్నారు.

కానీ, ఈ వీడియో ఫేక్ అని డాగీడిజైనర్ అనే ట్విటర్ హ్యాండిల్ వెల్లడిస్తూ పోస్టు చేసింది. ఇది క్రిప్టో వర్గాల్లో బాగా సుపరిచితం కావడంతో వెంటనే వైరల్‌గా మారింది. ''మస్క్, ఆయన కంపెనీలు ఎలాంటి క్రిప్టో గివ్‌అవే కార్యక్రమాలు చేయడం లేదు. ఈ మోసపు ఉచ్చులో పడొద్దు. జాగ్రత్తగా ఉండండి'' అని ఆ మెసేజ్‌లో పేర్కొన్నారు. ఈవిషయంపై మస్క్ నేరుగా ఎటువంటి ప్రకటన చేయలేదు. ఇటీవల కాలంలో డీప్ వీడియోలతో మోసాలు బాగా పెరిగిపోయాయి. దీనిలో స్వరం, సదరు వ్యక్తి రూపాన్ని కచ్చితంగా అనుకరిస్తారు. రానురాను ఈ స్కామ్‌లు మరింత నమ్మశక్యంగా మారుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ప్రజలు నమ్మకమైన సోర్సుల నుంచే సమాచారం పొందాలని నిపుణులు చెబుతున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ డీప్‌ఫేక్ కారణంగా కొన్నాళ్లక్రితం ఈ తరహాలోనే ఓ వైద్యుడు మోసపోయారు. మహారాష్ట్రలోని అంధేరీకి చెందిన డాక్టర్ పాటిల్‌కు ఇన్‌స్టాగ్రాం ఖాతా లక్ష్యంగా ఓ వీడియో దర్శనమిచ్చింది. రాజీవ్ శర్మ ట్రేడ్ గ్రూప్, దానికి చెందిన బీఎస్ఎఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అకాడమీలో పెట్టుబడులు పెడితే భారీ రిటర్న్స్ వస్తాయని పేర్కొంది. దాని గురించి ముకేశ్ అంబానీయే ప్రచారం చేసినట్టు ఉండటంతో ఆయన కేటుగాళ్ల కుట్రలో చిక్కారు. దాంతో ఆయన ఏడు లక్షల రూపాయలను 16 బ్యాంకు ఖాతాలకు పంపించారు. చివరికి తాను మోసపోయానన్న విషయం పాటిల్‌కు అర్థమైంది.



# కేరళలో గిన్నిస్ కుటుంబం!

**కేరళ ,తెలంగాణ ముచ్చట్లు:**

కేరళలోని మలప్పురానికి చెందిన ఓ కుటుంబం.. ప్రపంచ రికార్డులతో అదరగొడుతోంది. ఆ కుటుంబానికి చెందిన వారు వరుసగా గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించుకుంటూ 'గిన్నిస్ ఫ్యామిలీ ఆఫ్ ఇండియా'గా పేరుపొందారు. చేతులను ఉపయోగించకుండా 8.57 సెకన్లలో అరటిపండు తిని ఆ కుటుంబంలోని అబ్దుల్ సలీం గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కారు. ఆయన కుమార్తె జువైరియా తన మోచేతులు, మోకాళ్లపై నడుస్తూ తలపై చేయిని ఉంచి 54 మెట్లు ఎక్కింది. మరో కుమార్తె అయేషా సుల్తానా 16.50 సెకన్లలో ఆరోహణ, అవరోహణ క్రమంలో పుస్తకాలను అమర్చింది. ఇవన్నీ గిన్నిస్ రికార్డుల్లో చోటు పొందాయి. వీరి నుంచి స్ఫూర్తి పొందిన సలీం భార్య రషీద... 'మోస్ట్ స్టెప్-అప్స్'లో శిక్షణ తీసుకుంటోంది.



# రూ.2లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలి

- రైతు భరోసా 15000 చెల్లించాలి.
- ఏఐకేఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు.

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలైన 2లక్షల రుణమాఫీ, రైతు భరోసా తక్షణమే అమలుచేయాలని తెలంగాణ రాష్ట్రరైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం చింతకాని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డియాండ్ చేశారు. రెండు లక్షల రుణమాఫీకి సంబంధించి ఎటువంటి షరతులు లేకుండా చేయాలని ప్రభుత్వం చెబుతున్న నూరుశాతం రుణమాఫీ జరగలేదన్నారు. లక్షలాది మంది రైతులు రుణమాఫీ కోసం ఆశలు పెట్టుకున్నారన్నారు. దానిని అమలు చేయాల్సిన భాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. చనిపోయినవారికి, పట్టాదారు పాసుపుస్తకంలేని వారికి సాంకేతిక ఇబ్బందులు ఉన్న వారికి రుణమాఫీ అమలు కాలేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రైతుభరోసా పెట్టుబడి క్రింద ఇచ్చే సహాయం ఖరీఫ్ పూర్తయి రభీ ప్రారంభమైనా నేటికి రైతుభరోసా అందించలేదన్నారు. ప్రభుత్వం తక్షణం ఎటువంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ అమలు చేసి రెండు సీజన్లకు సంభంధించి రైతుభరోసా ఎకరానికి రూ.15000/ అందించాలన్నారు. వరికి బోనస్ అందరికి అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ తెచ్చిన నల్లచట్టాలను తక్షణమే రద్దుచేయాలని స్వామినాధన్ కమీషన్ సిఫార్సులు అమలుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ అక్బర్ కు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో ఏఐకెఎస్ రాష్ట్ర నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వేపూరి రవీంద్రబాబు కోశాధికారి కూచిపూడి రవి, సిపిఐ మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జునరావు, ఏఐకెఎస్ మండలాధ్యక్షుడు మార్గం శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పగిడిపల్లి ఏసు, నాయకులు తాళ్లూరి యాదగిరి, పదిమల వెంకట నరసయ్య గోగుల ఆది , బాలాజీ రావు, నక్కనబోయిన కృష్ణ, పెరిక ప్రభాకర్, రాయల గోవిందరావు జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.




# బాల సదనాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- బాల సదనాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

బాల సదనాన్ని ఆకర్షణీయంగాతీర్చిదిద్దాలని, దీనికి సంబంధించిన పనులను పకడ్బందీగా అధికారులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ నగరంలోని బాల సదనం భవనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.బాల సదనంలో చేపట్టాల్సిన మరమ్మత్తు పనులు, పిల్లలకు ఆహ్లాదం కోసం కల్పించాల్సిన ఆట పరికరాల పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ బాల సదనంలోని స్థలంలో ఉన్న బండలను తొలగించి భూమి చదును చేయాలని అధికారులకు తెలిపారు. అక్కడ పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే దిశగా ఉయ్యాల, జారుడు బండ, షటిల్ కోర్ట్ వంటి వివిధ ఆటలకు ఏర్పాటు చేస్తూ మంచి ప్లే ఏరియా సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాల సదనం భవనంలో అవసరమైన మరమత్తు పనులు చేపట్టాలని, భవనం గోడలపై ఆకర్షణీయమైన పెయింటింగ్స్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, బాల సదనం సూపరింటెండెంట్ వరలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.



# ప్రశాంతంగా ముగిసిన గ్రూప్ 2 పరీక్షలు

- పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించిన,
- జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి.
- పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ 144 సెక్షన్

**మెదక్ జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:**

జిల్లా వ్యాప్తంగా 16 సెంటర్ల లో కొనసాగుతున్న గ్రూప్ 2 పరీక్షలు. జవాబు పత్రాల తరలింపు వరకు పోలీసు బందోబస్తు నడుమ కొనసాగింపు. జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు.సోమవారం మెదక్ పట్టణంలోని వివిధ గ్రూప్ 2 పరీక్ష కేంద్రాలను పరిశీలించి సిబ్బంధికి పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి, ఈ సంధర్బంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. రెండవ రోజు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్న గ్రూప్2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జిల్లా లోని 16 కేంద్రాలలో కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. రెండవ రోజు పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల లోపల పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద 163 బి ఎన్ ఎస్ ఎస్ (144 సెక్షన్ అమల్లో ఉందని తెలిపారు. ఎలాంటి సభలు ర్యాలీలు సమావేశాలకు అనుమతులు లేవని పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలను పర్యవేక్షిస్తూ నిరంతరం పెట్రోలింగ్ గస్తీ నిర్వహిస్తుండాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష

- ఆదివాసులు సాగు చేస్తున్న భూమికి హక్కు కల్పించాలి... జి ఎస్ పి రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ
- పోలీస్ అధికారులు సిఆర్పిసి 145 సెక్షన్ ఎత్తివేయాలి...

**తెలంగాణ ముచ్చట్లు నూగురు వెంకటాపురం ములుగు జిల్లా.**



కొమరం భీమ్ కాలనీ ఆదివాసుల భూ పోరాటానికి వెంకటాపురం మండలం తాసిల్దార్ కార్యాలయం ఎదుట గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో రిలే నిహార దీక్షలకు శ్రీకారం చుట్టింది కొమరం భీం కాలనీ ఆదివాసి సాగు చేస్తున్న భూమిపై సి అర్ పి145 సెక్షన్ పెట్టి ఆదివాసి కుటుంబాలను చిన్నాభిన్న చేస్తున్నారని,ఇది ఏజెన్సీ చట్టాలకు విరుద్ధమని రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ ఆరోపించారు. వెంకటాపురం మండల కేంద్రం లోని తాసిల్దార్ కార్యాలయం ఎదుట గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో కొమరం భీం కాలనీ ఆదివాసుల పక్షాన రిలే నిరాహార దీక్షలు ప్రారంభించడం జరిగింది. ఈ దీక్ష కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ దీక్షను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ. వెంకటాపురంకొమరం భీమ్ కాలనీ ఆదివాసీలు గత 30 సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిలో సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తున్న,ఆదివాసీలు గతంలో ములుగు సబ్ కలెక్టర్ గా పని చేసిన విపీ గౌతమ్,ఆ యొక్క భూమిలో దిమ్మలు ఏర్పాటు చేసినారని తెలిపారు,మండలంలో కొంతమంది వలస గిరిజనేతరులు జీర్ణించుకోలేని పరిస్థితుల్లో అధికారులను ఒత్తిడికి గురిచేస్తూ ఆ యొక్క భూమిలో పంట వేసిన ఆదివాసీలు ఆ భూమి లోకి వెళ్లకుండా సి ఆర్ పి సి సెక్షన్ 145 విధించి ఆదివాసులను తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తున్నారని వెల్లడించారు. ఏజెన్సీలో అధికారులు ఆదివాసుల హక్కుల కోసం మరియు ఆదివాసుల సంక్షేమం కోసం పని చేయాలని అన్నారు.అధికారులు రాజకీయ పార్టీల నాయకుల మాటలు వింటున్నారని, ఆదివాసి సమస్యలను గాలికి వదిలేస్తున్నారని,ఏజెన్సీ చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేసే విధంగా అధికార యంత్రాంగం నడుచుకుంటుందని ఆయన ధ్వజమెత్తారు.అలాంటి అధికారులు ఏజెన్సీలో పని చేయకుండా వెళ్లిపోవాలని, అలాగే వాడగూడెం (జీ) సర్వేనెంబర్ 27 భూమిపై మరియు వ్యక్తుల పై పెట్టిన 145 సెక్షన్ వెంటనే తొలగించి,సాగు చేస్తున్న కొమరం భీమ్ కాలనీ వాసులకు భూమిపై హక్కు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి,ములుగు జిల్లా అధ్యక్షులు రేగ గణేష్,ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణ,వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం ప్రతాప్,పూనెం మునేశ్వరావు, కొమరం భీం కాలనీ వాసులు తాటి లక్ష్మణ్,ఉమేష్,శ్యామల మగ్గయ్య, రమేష్,బిమ్మయ్య,సుశీల, శాంత,సీత తదితరులు పాల్గొన్నారు.



# బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన జిల్లెల ఆదిత్య రెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి నియోజకవర్గం లోని బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను సోమవారం కాంగ్రెస్ యువ నాయకుడు, ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల్ల ఆదిత్య రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రిలో చికిత్స పొందిన వనపర్తి నియోజకవర్గం లోని బాధితులకు సోమవారం ఆయన నివాసంలో బాధితులకు 106 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జిల్లెల్ల ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వం కన్నా కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఒక ఏడాదిలోనే అత్యధిక సీఎం సహాయనిది ద్వారా చెక్కులను అందించి పేదల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయనిది అండగా ఉంటుందని అన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోవనపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణ, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సి పెంటన్న యాదవ్. వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మత్స్యశాఖ అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సమ్మద్ మియా. వనపర్తి మాజీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ బి. కృష్ణ,వనపర్తి జిల్లా కోర్ట్ ప్రభుత్వ న్యాయవాది లాయర్ కిరణ్, వనపర్తి యూత్ కాంగ్రెస్ నాయకులు లాయర్ బాబా, రాగి అక్షయ్ ,వనపర్తి మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుల చంద్రశేఖర్, గోపాల్పేట్ కాంగ్రెస్ నాయకుడు జిల్లెలప్రవీణ్ రెడ్డి,పెద్దమందడి మండల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు,సీనియర్ నాయకులు రాగి వేణు, రామేశ్వర్ రెడ్డి, నాగార్జున, భాస్కర్ ,తిరుపతయ్య, రాములు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొనడం జరిగింది.



# ప్రజా ప్రభుత్వం లోనైనా సహకరించండి సారు..

- 70 ఏళ్లుగా గ్రామానికి సర్పంచ్ గా ఎస్సీ రిజర్వేషన్ కల్పిస్తలేరు
- దళిత నాయకులు డిఎస్ మహేష్

**వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ పంచాయతీ లో సర్పంచ్ గా ఎస్సీ రిజర్వేషన్ కల్పిస్తలేరని గ్రామంలోని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వంలో నైన వెల్టూర్ గ్రామానికి సర్పంచ్ గా దళితులకు రిజర్వేషన్ కల్పించాలని సోమవారం గ్రామానికి చెందిన దళిత జిల్లా నాయకుడు డి ఎస్ మహేష్ ఆధ్వర్యంలో పెద్దమందడి తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు 1954వ సంవత్సరం నుండి నేటి వరకు 70 సంత్సరాలు ఎస్సి రిజర్వేషన్ కల్పించడం లేదని ప్రస్తుతం కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ వెల్టూర్ గ్రామ పంచాయతీకి 2025 సంవత్సరంలో జరగబోయే స్థానిక ఎన్నికలలో ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు.వెల్టూరు గ్రామపంచాయతీలో దాదాపు 100 కుటుంబాలు 500 ఓటర్ల జాబితా కలిగిన ఎస్సీలకు 1954 నుండి నేటి వరకు స్థానిక సంస్థల ఎన్నికలలో నిలిచేందుకు ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించకపోవడం అన్యామని అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ గుర్తించి వెల్టూరు గ్రామ పంచాయతీకి పంచాయతీ ఎన్నికలలో ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించే విధంగా కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలలో భాగంగా రిజర్వేషన్ అనేది రొటేషన్ రాజ్యాంగం ప్రకారం 25 సంత్సరాలకు ఒకసారి మార్పు జరగాలి. కానీ 70 సంత్సరాల నుండి ఒకసారి కూడా ఎస్ సి లకు రిజర్వేషన్ జరగలేదు. ఒక గ్రామంలో రెండు కుటుంబాలు ఉన్న రిజర్వేషన్ అనేది ఇవ్వాలి కానీ దాదాపు 100 కుటుంబాలు అంటే 500 ఓటర్లు జనాభా కలిగిన ఎస్సీలు వెల్టూరు గ్రామ పంచాయతీలో ఉన్నారు. అయినా కూడా కొంతమంది ఆనాటి ఉమ్మడి జిల్లా మండల అధికారుల స్వార్థంతో కొంతమంది రాజకీయ నాయకుల ఒత్తిడితో రిజర్వేషన్లు చేయకుండా ఎక్కువగా జనరల్ లేదా బీసీ రిజర్వేషన్ చేస్తున్నారని వారు తెలిపారు. 2025 సంస్థగత ఎన్నికలలో ఎస్సీ జనరల్ కు అవకాశం కల్పించే విధంగా కృషి చేయాలని వారు వేడుకున్నారు. ఇదివరకు వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. అలాగే నేడు పెద్దమందడి మండల తాసిల్దార్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. తర్వాత రాష్ట్ర కమిషన్ కు వినతిపత్రం అందజేయడం జరుగుతుందని వారు పత్రిక ముకంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్ మహేష్, గుండెల ఆంజనేయులు, ఎర్పుల రాములు, నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.




# 26న సిపిఐ భారీ ప్రదర్శనను జయప్రదం చేయండి

- ప్రజా సమస్యలపై దశల వారి ఆందోళన.
- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి..

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

డిసెంబర్ 26న సిపిఐ శత జయంతి సందర్భంగా ఖమ్మం నగరంలో జరిగే భారీ ప్రదర్శనను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్మల జితేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం చింతకాని సిపిఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఖమ్మంలో భారీ ప్రదర్శన రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాత్, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు పార్టీ శత వసంతాల సందర్భంగా అన్నిగ్రామాల్లో పతాకావిష్కరణ చేస్తామన్నారు. పార్టీ శతవసంతాల సందర్భంగా పార్టీ గత చరిత్రను పార్టీ సాధించిన పోరాట విజయాలను నేటి తరాలకు తెలియజేయాలన్నారు ఈ నెల 30న శతజయంతి రాష్ట్రస్థాయి ప్రారంభ సభ నల్గొండ లో ఉంటుందన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని బిజెపి మతం పేరుతో ఉన్మాదం సృష్టిస్తుందన్నారు. సిపిఐ మద్దతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల హామీలను విస్మరిస్తుందని ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగకముందే హామీలు అమలు చేయాలన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రభుత్వం పై దశల వారి పోరాటానికి పార్టీ సిద్ధమవుతుందన్నారు. చింతకాని మండలం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు 26న ఖమ్మం లో జరిగే భారీ ప్రదర్శనలో 500 మందికి తగ్గకుండా తరలిరావాలన్నారు. సమావేశానికి ముందు ఇటీవల మరణించిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఫోటు ప్రసాద్, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేష్ మృతికి సంతాపం తెలియజేశారు ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు వేపూరి రవీంద్రబాబు పార్టీ మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్, జిల్లా సమితి సభ్యులు కూచిపూడి రవి మార్గం శ్రీను పగిడిపల్లి ఏసు నాయకులు తాళ్లూరు యాదగిరి బాలాజీ రావు , పది మల వెంకట నరసయ్య, వేముల జానకిరామయ్య గోగుల ఆది, పెరిక ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

# దశదిన కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే కొండ బాల

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



సోమవారం ప్రొద్దుటూరు గ్రామంలో పెంట్యాల సైదేశ్వర రావు దశదిన కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే కొండ బాల కోటేశ్వరరావు చింతకాని టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య మంకెన రమేష్ మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు గడ్డం రామారావు వేముల నరసయ్య బొడ్డు వెంకట రామయ్య డిసిసిబి డైరెక్టర్ నన్నక కోటయ్య ప్రొద్దుటూరు మాజీ ఎంపీటీసీ పెంట్యాల భారతమ్మ సర్పంచ్ తుడుం రాజేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు

# ప్రశాంతంగా ముగిసిన గ్రూప్ 2 పరీక్షలు..

- పోలీసు సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ. డి.ఉదయ్ కుమార్ రెడ్డి

**మెదక్ జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:**



రెండు రోజుల పాటు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ TGPSC ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్ II పరీక్షల ను జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగిశాయని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. రెండవ రోజు గ్రూప్ II పరీక్షల సందర్బంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా కేంద్రం లోని పలు కళాశాలను సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తద్వార రెండవ రోజు కూడా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి అని అన్నారు. ఈ పరీక్షలు సజావుగా సాగేందుకు అభ్యర్థులు కూడా చక్కగా సహకరించారని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగేలా చూసిన నోడల్ ఆఫీసర్, జిల్లా అదనపు ఎస్పీ, డిఎస్పీ, సిఐలు, పోలీస్ అధికారులకు పోలీసు సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

## సమాచార హక్కు చట్టం
# సామాన్యుడి చేతిలో వజ్రాయుధం

- **జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్**

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**




సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నూతన కార్యవర్గం ఎన్నికలు జరుగగా, రంగారెడ్డి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులుగా రామగళ్ళ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మల్లం శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగా వేముల పుష్పలత, సంయుక్త కార్యదర్శిగా దీపక్ కులకర్ణి, గ్రేటర్ హైదరాబాద్ అధికార ప్రతినిధిగా రాసునూరి లక్ష్మణ్ లు ఎన్నికయ్యారు. ఈ నియామక పత్రాలను సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ మరియు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి అందజేశారు.ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, 2005లో అమలులోకి వచ్చిన సమాచార హక్కు చట్టం ప్రభుత్వ కార్యాలయాల్లో పకడ్బందీగా అమలు కావాలని అన్నారు. ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లోగా అందించాల్సిన బాధ్యత అధికారులకు ఉందని, అత్యవసర పరిస్థితుల్లో 48 గంటల్లోనే సమాధానం ఇవ్వాలని తెలిపారు. ఈ చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం లాంటిదని, దుర్వినియోగం కాకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ నుండి పార్లమెంటు వరకు ప్రతి పౌరుడికి ప్రభుత్వ కార్యాలయాల పనితీరును తనిఖీ చేసే హక్కు ఉందని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం 4(1)బి సెక్షన్ కింద 17 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని అధికారులు స్వచ్ఛందంగా అందించాలని, మూడో వ్యక్తి సమాచారం విషయంలో ప్రజా ప్రయోజనాల మేరకు సెక్షన్ 11(1) ప్రకారం సమాచారం అందించవచ్చని వివరించారు. సమాచారం అందించడంలో విఫలమైతే సంబంధిత అధికారులపై కనిష్టంగా రూ. 250 నుండి గరిష్టంగా రూ. 25,000 వరకు జరిమానా విధించే హక్కు సమాచార కమిషనర్‌కు ఉందని పేర్కొన్నారు. దేశ భద్రత, కోర్టు జడ్జిమెంట్ లు, పోలీస్ స్టేషన్ భద్రత వంటి కొన్ని అంశాలు మినహాయించబడ్డాయని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు జి.ప్రియ రెడ్డి, మహిళా సంయుక్త కార్యదర్శి ఎర్రబెల్లి ప్రగతి, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అంతటి అజయ్ కుమార్, ఉపాధ్యక్షులు ముచ్చర్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

- **జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రజావాణిలో వచ్చిన వినతులను సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా అధికారులను ఆదేశించారు.

సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.

ఖమ్మం మదీన మసీదు అధ్యక్షుడు ఎం.డి. హకీం ముస్తఫా నగర్ ఏరియాలోని మైనారిటీలకు ఖబరస్తాన్ ఏర్పాటుకు భూమి కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం అర్బన్ తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కల్లూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన చింతలపాటి చెన్నారావ్ మన ఊరు మన బడి పథకం క్రింద తల్లాడ మండలం కుర్నవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 45 లక్షల విలువ గల పనులు చేశానని, అందులో 10 లక్షల వరకు బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని, త్వరగా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యా శాఖ అధికారికు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ముదిగొండ మండలం వల్లభి గ్రామానికి చెందిన కృష్ణవేణి వల్లభి గ్రామం నందు అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ పోస్ట్ ఖాళీ అయినందున ఎస్టి కులస్తురాలైన తనకు అవకాశం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ నిబంధనల ప్రకారం పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. తల్లాడ గ్రామానికి చెందిన ఈలప్రోలు అంజలి ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా, ఈఈ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణిలో డిఆర్డీవో సన్యాసయ్య, డిఆర్వో ఎం. రాజేశ్వరి, కలెక్టరేట్ ఏ.ఓ. అరుణ, జిల్లా అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## నేడు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం నగరం శ్రీనగర్ కాలనీలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఖమ్మం రూరల్ , తిరుమలాయపాలెం మండలాలకు చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల చెక్కులను మంగళవారం ఉదయం 11గంటలకు పంపిణీ చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. లబ్దిదారులతో పాటు ఆయా మండలాల ముఖ్య నాయకులు పాల్గొనాలని కోరారు.



## ఏడాది గడిచిన ఇచ్చిన హామీల అమలేది...?

- **టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ కు వినతిపత్రాన్ని అందజేత.**

**మెదక్ జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా విద్యారంగానికి, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చకపోవడం, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ సోమవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ కి టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో ఉపాధ్యాయులకు హామీ ఇచ్చిన ప్రకారం రెండు సంవత్సరాలుగా పెండింగులో ఉన్న అన్ని రకాల బిల్లులను సత్వరమే విడుదల చేయాలని, ఇకనుంచి ఎప్పటి బిల్లులు అప్పుడే చెల్లించాలని, ఉద్యోగ విరమణ పొందిన వారికి ఇవ్వాల్సిన చెల్లింపులు వెంటనే అందజేయాలని ప్రభుత్వానికి ఆ లేఖలో పేర్కొన్నామని తెలిపారు. జి.ఓ.317 వల్ల స్థానికత కోల్పోయిన అందరిని బేషరతుగా సొంత జిల్లాలకు పంపాలని, పెండింగులో ఉన్న డి.ఏ.లను ప్రభుత్వం విడుదల చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పి.ఆర్.సి. అమలు చేస్తామన్న, సీపీఎస్ ను రద్దు చేస్తామన్న వాగ్దానాన్ని ఇప్పటికైనా నిలుపుకోవాలని, విద్యారంగానికి బడ్జెట్ లో 15 శాతం నిధులు కేటాయించి పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో టీపిటిఎఫ్ నాయకులు తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు యాదగిరి ప్రధాన కార్యదర్శి వెంకట్ రామ్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ సంగయ్య, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## కెఎంసి పూర్వ వైద్య విద్యార్థుల
# అపూర్వ సమ్మేళనం

- **50 ఏళ్ల తర్వాత కలయిక పంచుకున్న అలనాటి జ్ఞాపకాలు**
- **నాటి తరగతి గదుల్లోనూ తడిమి చూసిన విద్యార్థులు**
- **నాటి గురువులకు ఘనంగా సన్మానం**
- **కళాశాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని నిర్ణయం**

**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు:**

1974 బ్యాచుకు చెందిన విద్యార్థులంతా 50 ఏళ్ల తర్వాత కలుసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అలనాటి బ్యాచుకు చెందిన విద్యార్థులంతా ప్రస్తుతం వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అనేకమంది వైద్యరంగంలో ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్నారు. వారి సమాచారాన్ని సేకరించి పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఏర్పాట్లు చేశారు. తాము చదువుకున్న కాకతీయ వైద్య కళాశాలలను వేదికగా ఎంచుకున్నారు. కాలేజీ క్యాంపస్ లోని ఎన్ఆర్ఐ హాలులో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం కన్నుల పండువగా నిర్వహించారు. వరంగల్ తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా ఈ అపూర్వ సమ్మేళనానికి వచ్చారు. వివిధ ప్రాంతాలతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, అహ్మదాబాద్, కేరళ తదితర ప్రాంతాల నుండి వచ్చిన వారు వీరిలో ఉన్నారు. 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు పరస్పరం ఆప్యాయతతో ఆలింగనం చేసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. కుటుంబ వివరాలను పరస్పరం తెలియచేసుకున్నారు. అంతేకాకుండా కాలేజీలో అప్పుడు తాము చదువుకున్న క్లాస్ రూములను సందర్శించారు. అర్ధ శతాబ్దపు అపూర్వ విద్యార్థుల సమ్మేళనంలో 44 మంది కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. అప్పటి బ్యాచ్ కి చెందిన కొందరు పూర్వ విద్యార్థుల్లో చనిపోయారు. వారికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న తమ ఉన్నతికి వేదిక అయిన కేఎంసి అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కళాశాల క్యాంపస్ లో ఏదైనా శాశ్వత నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయం చేశారు. స్థానికంగా ఉన్న పూర్వ విద్యార్థులు డాక్టర్ పోలా నటరాజ్ , డాక్టర్ కె.తిరుపతిరెడ్డి, డాక్టర్ ఏ.రవీంద్ర, డాక్టర్ కె.ప్రదీప్ రెడ్డి ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి అవసరమైన ఏర్పాట్లు చేసి కార్యక్రమ విజయవంతంలో సఫలీకృతులయ్యారు. ఈ సమ్మేళనంలో అప్పటి గురువులు డాక్టర్ పి.నరసింహ రెడ్డి, డాక్టర్ శేఖర్ రెడ్డి, డాక్టర్ బుచ్చిరెడ్డి, డాక్టర్ క్రాంతిరావు, డాక్టర్ దామోదర్ కౌశికర్, డాక్టర్ శశి కుమార్, డాక్టర్ ఏకనాధం తదితరులను ఘనంగా సత్కరిరించి జ్ఞాపికలను అందచేశారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.




## కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ..

- **విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పౌష్టికాహారం అందించాలి.**
- **జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ**

**మెదక్ జిల్లా ప్రతినిధి,తెలంగాణ ముచ్చట్లు :**

టేక్మాల్ మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సోమవారం జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో వంట వంటగదిని స్టోర్ రూమ్ ని కూరగాయలను బియ్యాన్ని పప్పులు వంట సరుకులను డీఇవో పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి ఇప్పుడు భోజనం ఎలా ఉంటుంది పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనం సమయానికి పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ మాట్లాడుతూ. విద్యార్థులకు పోషకాలతో కూడిన బలవర్ధక నాణ్యమైన భోజనం పోషకాహారంతో పాటు విద్యను అభ్యర్థించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యార్థులు మంచిగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు దూరంగా ఉన్నామని భావనను దరి చేరనివ్వకుండా మంచిగా చదువుకుని జీవితంలో కన్నవారి కలలు నిజం చేయాలని కష్టపడి కాకుండా ఇష్టపడి చక్కగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యతోపాటు ప్రభుత్వ నిర్దేశించిన విధంగా మెనూ ప్రకారం ఉదయం టీ. టిఫిన్ మధ్యాహ్నం నాణ్యమైన భోజనం పౌష్టికాహారం విద్యార్థులకు సమయానికి అందించాలని వంట విషయంలో ఎలాంటి పొరపాట్లు చేయకూడదని కస్తూర్బా గాంధీ పాఠశాల సిబ్బందికి సూచించారు.




## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల
## కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

- **సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి**
- **ఎంసిపిఐ(యు) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంస రెడ్డి**

**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు:**

సోమవారం రోజున భారత మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ (ఐక్య),అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి గారికి మెమోరాండం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మాస్ సావిత్రి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంస రెడ్డి, ఏఐసిటియు జిల్లా కన్వీనర్ మొగిలి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు దాసోహం అంటున్నది అందులో భాగంగానే ప్రభుత్వరంగ పరిశ్రమలనూ ప్రైవేటీకరిస్తూ కార్మికుల సంఖ్యను దినందినం తగ్గించడం వల్ల లక్షలాదిమంది సంఘటిత కార్మిక వర్గం అసంఘటిత రంగంలోకి నెట్టి వేయబడుతున్నారు.అనేక పోరాటాల ఫలితంగా సాధించిన 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా మార్చి పెట్టుబడిదారీ కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ పరిచింది కేంద్ర ప్రభుత్వం. మన రాష్ట్రంలో కూడా ప్రభుత్వ రంగ పరిశ్రమల స్థాపన లేదు మీరైనా ప్రభుత్వ రంగంలో పరిశ్రమల స్థాపించాలనే కోరుతున్నాము అదేవిధంగా దేశంలో రాష్ట్రంలో అసంఘటిత కార్మిక వర్గం కోట్లాదిమంది ఉన్నారు వారి శ్రమకు తగిన వేతనాలు సంక్షేమం లేదు తక్షణమే సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి 44 కార్మిక చట్టాలను పునర్ధరించి నాలుకోడులను రద్దు చేయాలి ప్రభుత్వ రంగంలో పరిశ్రమలను స్థాపించాలి ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి కనీస వేతనాలను నెలకు 36 వేల ఇచ్చి చట్టాన్ని అమలు చేయాలి అదేవిధంగా అసంఘటిత కార్మికులకు కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అన్ని రకాల పనులు చేసే కార్మికులకు కార్మిక చట్టాలను వర్తింప చేయాలని మరియు వివిధ రంగాలలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు 50 సంవత్సరాలు నిండగానే నెలకు 5000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. అదేవిధంగా ధాన్యం కొనుగోలు లో ఉపయోగిస్తున్న 50 కేజీల ప్లాస్టిక్ సంచులనూ నిషేధించి వ్యవసాయ మార్కెట్లో పనిచేస్తున్న కార్మిక సంఘంలో ఒకరికి డైరెక్టర్ పదవి ఇవ్వాలి ప్రజల కొనుగోలుకు అనుకూలంగా విద్య వైద్యం నిత్యవసర ధరలను నియంత్రించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాము లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరిక జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి,నీల రవీందర్,కర్ర రాజిరెడ్డి ఏ ఐ సి టి యు జిల్లా అధ్యక్షులు మంద భద్రయ్య ఏఐసిటియు జిల్లా నాయకులు సంపత్ ఇందు మాట్లాడ మొగిలి అనిల్ పార్టీ సభ్యులు గోనెల గోపాల్ జ్యోతి రమేష్ నరేష్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.




## కుంగ్ ఫూలో రాణిస్తున్న విద్యార్థులు

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**

ఇంటర్నేషనల్ హూయన్ చంగ్ ష్ ఇండియా ఆధ్వర్యంలో, హైదరాబాద్‌లోని చరణ్ సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన 4వ నేషనల్ లెవల్ ఓపెన్ కుంగ్ ఫు అండ్ కరాటే ఛాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో పలువురు విద్యార్థులు, ప్రతిభ చూపారు.ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి టీ.అర్చన, రెండవ బహుమతి టీ.అమిత, మూడవ బహుమతి ఏషియా పౌల్, నాలుగవ బహుమతి ఐశ్వర్య, ఐదవ బహుమతి టీ.చందన స్పారింగ్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు.ఈ విజయాల గురించి కుంగ్ ఫు మాస్టర్ ఎర్ర. రమేష్ మాట్లాడుతూ, తన గ్రాండ్ మాస్టర్, ఫిల్మ్ స్టార్, గోల్డ్ మెడలిస్ట్ బి.వెంకట బాబు సహకారంతో రెడ్ స్టార్ట్ కుంగ్ ఫు మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ద్వారా పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా కుంగ్ ఫు, కరాటే మార్షల్ ఆర్ట్స్ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాధించిన విజయాలను ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం,గ్రామస్థులు అభినందిస్తూ, విద్యార్థులు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మాస్టర్ ఎర్ర. రమేష్ సేవలను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు.



## సర్వేలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్ పర్సన్

**జడ్చర్ల,తెలంగాణ ముచ్చట్లు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే కార్యక్రమంలో జడ్చర్ల మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ దోరేపల్లి లక్ష్మి పాల్గొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో దొరేపల్లి లక్ష్మి పాల్గొని సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను నమోదు చేయాలని సూచించారు. సర్వేలో నమోదు లో ఎలాంటి తప్పులు దొర్లకొండ చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కమిటీ సభ్యులు రవితేజ, సాయిబాబా, అజ్జు, వార్డ్ ఆఫీసర్ నందకిషోర్ తదితరులు ఉన్నారు.




# రుణమాఫీపై ప్రభుత్వం తప్పుడు ప్రచారం....
## రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు

- రైతు బరోసా తక్షణం అమలు చేయాలి
- పేదలందరికీ రూ.12వేలు ఇవ్వాలి
- తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాపితంగా ధర్నాలు

**ఖమ్మం, తెలంగాణ ముచ్చట్లు**

రైతు రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తుందని రూ.2 లక్షల లోపు రుణాలున్న రైతుల్లో ఎక్కువ మంది మాఫీ జరగ లేదని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపిచారు. రాష్ట్ర వ్యాపితంగా 50 లక్షల మంది రైతులుంటే అందులో 50 శాతం మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని రూ.2 లక్షల లోపు ఉన్న రైతులలో కూడా వివిధ కారణాలతో మాఫీని నిలుపుదల చేశారని ఆయన తెలిపారు. తెలంగాణ రైతు సంఘం పిలుపుమేరకు సోమవారం ఖమ్మం జిల్లా వ్యాపితంగా మండలకేంద్రాల వద్ద ధర్నాలు నిర్వహించారు. ఖమ్మం రూరల్ అర్బన్, రఘునాదం మండల కేంద్రాలవద్ద జరిగిన ఆందోళనలలో పాల్గొన్న హేమంతరావు మాట్లాడుతూ పాస్పుస్తకాలు లేవని, కుటుంబ సభ్య సంఖ్య సరిపోలేదని రుణమాఫీని నిలుపుదల చేశారని మరణించిన రైతులకు సంబంధించి రుణమాఫీ జరగలేదన్నారు. 4వ దఫా రూ.3 వేల కోట్ల రుణమాఫీ చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇంకా రైతుల ఖాతాలలో జమకాలేదన్నారు. రైతు బరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వం ఊరిస్తుందని అమలుకు వాయిదాలు పెడుతుందని ఆరోపించారు. సంవత్సర కాలంగా రైతు బరోసా లేదని నవంబర్, డిసెంబర్ అంటూ వాయిదాలు వేసి ఇప్పుడు సంక్రాంతి అంటున్నారని రైతుబరోసాను రైతుల ఖాతాలలో వెంటనే జమచేయాలన్నారు. రైతు బీమా అమలు చేయడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతు సంఘం డిమాండ్ చేస్తుందని హేమంతరావు తెలిపారు. ధాన్యం, పత్తి కొనుగోళ్లలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తున్నదని దీనిపై తగు చర్యలు తీసుకోవాలని తేమ పేరుతో కొర్రీలు పెడుతున్నారని వారు తెలిపారు. దేశవ్యాపితంగా రైతాంగ ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నారని ఢిల్లీ సరిహద్దులలో జరుగుతున్న రైతాంగం పోరాటం బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, లాఠీచార్జీలు చేయడం నిలిపివేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. నూతన సాగు చట్టాలను దొడ్డిదారిన అమలు చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని రైతాంగ ఉ ద్యమాలకు సంబంధించి నమోదైన కేసులన్నింటినీ తక్షణం ఎత్తివేయాలని, ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న రైతులను తక్షణం ఉపసంహరింపచేయాలని హేమంతరావు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 28 నుండి అమలు చేయనున్న ఆర్థిక చేయూత పథకాన్ని భూమిలేని ప్రతి పేదవానికి అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ, గ్రామీణ పేదలందరికీ ఈ పథకాన్ని వర్తింపచేయాలన్నారు. ఖమ్మం రూరల్, అర్బన్, రఘునాధపాలెం మండల రెవిన్యూ అధికార్లకు సమస్యలతో కూడిన వినతి పత్రాలను అందచేశారు. ఖమ్మం రూరల్ మండల కార్యాలయం ముందు జరిగిన ఆందోళనలో సి.పి.ఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్ మహ్మద్ మౌలానా, రైతు సంఘం నాయకులు మిడికంటి చిన్న వెంకటరెడ్డి, పుచ్చకాయల సుధాకర్, పాసంగుల చంద్రావు, బానోత్ రామ్మోటి, మిడికంటే పెద్ద వెంకటరెడ్డి, మామిడి సుర్యనెడ్డి, వెన్నం భాస్కర్, శ్రీనాధరెడ్డి, వెంపటి రాము పాల్గొనగా అర్బన్ కార్యాలయం ముందు ధర్నాలో సి.పి.ఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఎస్.కె. జానిమియా, మహ్మద్నలాం, పగడాల మల్లేష్, మేకలశ్రీనివాసరావు, నాయకులు యానాలి సాంబశివరెడ్డి, నూనెశశిధర్, ఎస్.కె. సైదా, పోటుపూర్ణచంద్రావు, జ్వాలా నర్సింహారావు, ప్రతానపు రామనాధం తదితరులు పాల్గొన్నారు. రఘునాధపాలెం మండల కార్యాలయం ముందు జరిగిన ఆందోళనలో సి.పి.ఐ మండల కార్యదర్శి శాకమూరిశ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు బాగం ప్రసాద్, బానోత్ చీనా, బానోత్ రవి, సురభిశ్రీను తదితరులు పాల్గొన్నారు.




# పోలీస్ ఠాణాను తనిఖీ చేసిన

- మల్టీ జోన్ -2 ఐజి సత్యనారాయణ

**జడ్చర్ల, తెలంగాణ ముచ్చట్లు**

జడ్చర్ల పోలీస్ ఠాణాను మల్టీ జోన్ 2 ఐజి సత్యనారాయణ ఐపీఎస్ తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలలో భాగంగా సోమవారం ఐ.జి జడ్చర్ల పోలీస్ ఠాణాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది యొక్క వివరాలు, నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీసులు ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ప్రజలతో మర్యాద పూర్వకంగా మాట్లాడాలని ఫిర్యాదు దారులందరికీ ఒకే రకమైన సేవలు అందించాలని సూచించారు. అధికారులు సిబ్బంది ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకుని శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూసు కోవాలని తెలిపారు. జడ్చర్ల పోలీస్ ఠాణాలో అధిక కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో ఆస్తి సంబంధిత నేరాలు, శారీరక నేరాలలో పాల్గొన్న నేరస్తులపై హిస్టరీ షీట్స్ తెరిచి వారిపై నిఘా ఉంచాలని నిర్దేశించారు పరిశోధనలో ఉన్న సీడీ ఫైల్ లు, వాటిలో ఉన్న ఫైళ్లను పరిశీలించారు. జడ్చర్ల పరిధిలో రెండు జాతీయ రహదారులు ఉన్నందున ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి రోజు పోలీసు అధికారులు, సిబ్బంది సమయం దొరికినప్పుడు వ్యాయామం, యోగ, ధ్యానం, వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నీట్ టర్న్ అవుట్ కలిగి ఉండి, మంచి క్రమశిక్షణ సమయపాలన పాటించాలని లీడర్షిప్ లక్షణాలు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపిఎస్, డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ ఆదిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### పురిటి నొప్పులు వస్తున్నా సరే 'డోంట్ కేర్'
# గ్రూప్2 పరీక్ష రాసిన నిండు గర్భిణీ

**నాగర్కర్నూల్, తెలంగాణ ముచ్చట్లు**

నాగర్కర్నూల్ జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగాలకు పరీక్ష జరుగుతున్న కేంద్రంలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ఎలాగైన ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో ఓ నిండు గర్భిణీ గ్రూప్2 పరీక్షలు విజయవంతంగా పూర్తి చేశారు. బల్మూరు మండలం బాణాల గ్రామానికి చెందిన రేవతి అనే గర్భిణీ నాగర్ కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో గ్రూప్2 పరీక్ష రాసేందుకు వెళ్లారు.

**డెలివరీ డేట్ ట్విస్ట్ :** ఆదివారం (డిసెంబరు 15న) గ్రూప్2 మొదటి పేపర్ పూర్తి కాగా సోమవారం (డిసెంబరు 16) ఈరోజు గ్రూప్2 ఉదయం పేపర్ 3 పరీక్ష రాస్తున్న సమయంలోనే ఆమెకు మెల్లగా పురిటి నొప్పులు వచ్చాయి. అప్రమత్తమైన పరీక్ష నిర్వహణ అధికారులు రేవతిని వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి సిద్ధమయ్యారు. కానీ ఆమె అందుకు అంగీకరించలేదు. పరీక్ష రాస్తానని గట్టిగా చెప్పారు. రేవతి డెలివరీ తేదీ ఇవాళే కావడంతో పరీక్ష కేంద్రంలో సిబ్బందితో సహా అందరూ కాస్త ఆందోళనకు గురయ్యారు.

**వదలని సంకల్పం :** మధ్యాహ్నం కూడా పరీక్ష రాస్తే గ్రూప్2 మొత్తం నాలుగు పేపర్లు పూర్తవుతాయి. నాలుగో పేపర్ కూడా రాస్తానని పట్టుబట్టింది. అధికారులు ఎంత చెప్పినా వినలేగదు. ఆమె పట్టు వదలకుండా పరీక్ష రాస్తానని చెప్పడంతో అధికారులు ఈ విషయాన్ని నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ ఆమె కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

**రేవతి ప్రసవం కోసం అక్కడే ఏర్పాటు చేసిన 108వాహనం**

తక్షణమే గర్భిణీ కోసం పరీక్ష కేంద్రంలో 108 అత్యవసర వాహనాన్ని అందుబాటులో ఉంచారు. పరీక్ష బాగా రాయమని రేవతికి వైద్య సిబ్బంది ధైర్యం చెప్పి ప్రోత్సహించారు. పరీక్ష పూర్తయ్యే వరకు అందరూ టెన్షన్ పడినా, నాలుగో పేపర్ను కూడా విజయవంతంగా పూర్తి చేసి రేవతి బయటికి రావడంతో ఆమెను నేరుగా 108 సిబ్బంది జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో ఆమె బంధువులు, ప్రభుత్వ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్వే స్పష్టంగా, వేగంగా పూర్తి చేయాలి

- కొనుగోళ్లు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలి.
- అంగన్వాడి కేంద్రాలలో మెనో ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలి.

**-డోర్నకల్ తెలంగాణ ముచ్చట్లు:**



కురవి,మహబూబాబాద్ పట్టణం 11వ వార్డు, భవాని నగర్ కాలనీ, 16వ వార్డు, రామన్నపేట కాలనీ, మరిపెడ మండలం, అబ్బాయిపాలెం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి పక్క ఇండ్లు నిర్మించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే సర్వే నిర్వహించడం జరుగుతుందని, ప్రతిరోజు సర్వే నివేదికలు ప్రభుత్వానికి ఆన్లైన్ విధానం ద్వారా సమర్పించడం జరుగుతుందని అన్నారు, ప్రభుత్వం సూచించిన ప్రకారం ఖచ్చితమైన సమాచారం క్షేత్రస్థాయిలో సేకరించాలని, సిబ్బందిని ఆదేశించారు,సర్వే వివరాలను నిత్యం ఉదయం, సాయంత్రం పర్యవేక్షిస్తూ తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో ఇందిర ఇండ్ల సర్వే జరుగుతుందని అన్నారు,కురవి మండల కేంద్రం,మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు,కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని సంబంధిత నిర్వాహకులను ఆదేశించారు, ధాన్యానికి సంబంధించి రైతుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి వెంటనే డబ్బులు పడేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు, ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చింది, ఎంత ధాన్యం కొనుగోలు చేశారు, ఇంకా ఎంత ధాన్యం రావాల్సి ఉంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు,మరిపెడ మండలం, అబ్బాయిపాలెం గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు, పాఠశాలలో రుచికరమైన భోజనం అందించాలని, మంచి వాతావరణంలో విద్య బోదనలు అందించాలన్నారు,అంగన్వాడి కేంద్రాలలో మెనో ప్రకారం పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలని, శ్యామ్, మ్యామ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి నిత్యం పర్యవేక్షించాలని, గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు హెల్త్, పౌష్టిక ఆహారం అందించెందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని సూచించారు,మహబూబాబాద్ పట్టణంలో ఉన్న వెజ్, నాన్ వెజ్, ఫ్రూట్, ఫ్లవర్ మార్కెట్ ను సందర్శించారు, ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు మున్సిపల్ కమిషనర్ రవీందర్, డిప్యూటీ ఇంజనీర్ ఉపేందర్, కురవీ ఎంపీడీవో, తదితరులు ఉన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల కోసం
# పారదర్శకంగా సర్వే చేయాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ తెలంగాణ ముచ్చట్లు**

అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.మున్సిపాలిటీ పరిధిలోని 22 వ వార్డులో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ ను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల క్షేత్రస్థాయి స్థితిగతులపై ఇందిరమ్మ ఇళ్ల యాప్ వినియోగిస్తూ చేస్తున్న సర్వే ప్రక్రియ ను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి మాట్లాడుతూ..ఇండ్లులేని నిరుపేదలకు నివాసం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తోందని, దరఖాస్తుదారులు..సంబంధిత పత్రాలను ముందస్తుగా అందుబాటులో పెట్టుకొని సర్వే వేగవంతం అయ్యేందుకు సహకరించాలన్నారు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి తప్పిదాలకు తావులేకుండా వివరాలను సేకరించి ఇందిరమ్మ యాప్లో లాగిన్ అయ్యి వివరాలను పక్కగా నమోదు చేయాలన్నారు. సర్వే కోసం భూమి యాజమాన్య పత్రం అత్యంత ముఖ్యమైనదని, సొంత ఇంటికి స్థలం ఉందా ఉంటే దానికి సంబంధించిన ధృవపత్రాలు అవి లేని పక్షంలో ఇంటి పన్ను రసీదులు తెల్ల రేషన్ కార్డ్ తదితర పత్రాలను పరిశీలించాలన్నారు.లబ్ధిదారుడితో పాటు ఇంటి పైకప్పు, స్థలానికి సంబందించిన చిత్రాలను యాప్ లో సక్రమంగా అప్లోడ్ చేయాలన్నారు.ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని సర్వే జరిగే సమయంలో ప్రజలు అందు బాటులో ఉండే విధంగా షెడ్యూల్ గురించి ముందుగానే సమాచారం అందించాలని అన్నారు.ఈ కార్యక్రమం లో కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




# ఆహార మార్పులతో అద్భుత జీవనం సాధ్యమే!

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు**

ఫిజీషియన్స్ అసోసియేషన్ ఫర్ న్యూట్రిషన్ (PAN) ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాదులోని బంజారా హిల్స్ హయాత్ ప్లేస్లో 29వ ఇన్పర్సన్ కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (CME) కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం ఆహార పోషకాహార ప్రాధాన్యత, ముఖ్యంగా ప్లాంట్ బేస్డ్ డైయెట్స్ ద్వారా నాన్కమ్యూనికబుల్ డిసీజెస్ (NCDs) నిర్వహణపై చర్చించడానికి వైద్య నిపుణులు, పోషకాహార నిపుణులను ఒక వేదికపైకి తెచ్చింది.ఈ సదస్సులో డాక్టర్ హేమలత, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రజీన షహిన్, డాక్టర్ ప్రత్యుష నెరెళ్ల వంటి వైద్య నిపుణులు ప్రజెంట్ చేసిన ఆధునిక రిసెర్చ్ ఫలితాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. డాక్టర్ రాజేందర్ రామగిరి ఆధ్వర్యంలో డయాబెటిస్ రిమిషన్పై కేస్ ప్రెజెంటేషన్, జీవన శైలిలో మార్పులతో వచ్చిన అద్భుత ఫలితాలను వివరించారు. IBD, శోగ్రెన్ సింద్రోమ్ నుండి రిమిషన్ సాధించిన మూడు రోగుల కేస్ స్టడీ, పోషకాహారం ద్వారా సాధించిన ఫలితాలను తెలిపారు. డాక్టర్ సుందీప్ లక్టాకియా మోడరేట్ చేసిన ప్యానెల్ డిస్కషన్, వైద్య రంగంలో పోషకాహారం సమగ్రతపై చర్చించారు. డాక్టర్ హేమలత ప్రసంగంలో నిరోధక ఆరోగ్యం, వ్యాధి నిర్వహణలో పోషకాహారం ప్రాధాన్యతను హైలైట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఒకరితో ఒకరు కొత్త ఆలోచనలను పంచుకున్నారు. పోషకాహారంపై దృష్టి సారించడం ద్వారా ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడంలో PAN ఇండియా తన కట్టుబాటును మరింత బలోపేతం చేసింది. ఈ CME ప్రోగ్రామ్ PAN ఇండియా లక్ష్యమైన ఆహార సంబంధిత వ్యాధులను నివారించి, పర్యావరణ అనుకూల ఆరోగ్య పరిష్కారాలను ప్రోత్సహించే దిశగా మరొక మైలురాయిగా నిలిచింది.




### జమిలి ఎన్నికలు దేశ
# సంక్షేమానికి మంచివి కావు....!

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- జిల్లా తృతీయ మహాసభలు

**చౌటుప్పల్ , తెలంగాణ ముచ్చట్లు**



యాదాద్రి భువనగిరి జిల్లా తృతీయ మహాసభల సందర్భంగా సోమవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఎస్ఎంఆర్ గార్డెన్ లో నిర్వహించిన ప్రతినిధుల సభకు హాజరైన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు.దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల కష్టార్జితంతో పోగేసిన సంపదను ఆదాని,అంబానీలకు దోచిపెట్టడం సరికాదన్నారు.సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం విదేశాల్లో సేకరించిన70,80 వేలకోట్ల సంపదను లంచాల రూపకంగా ఏపీ ముఖ్యమంత్రి జగన్ కు రూ .17 వందల ఇచ్చినట్లు అమెరికా ప్రభుత్వం బయట పెట్టిందన్నారు.దీంతో తెలంగాణ రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆదాని ఇచ్చిన రూ.100 కోట్లు తిరిగి ఇవ్వడం సంతోషకరమైన అన్నారు.దావోస్ నగరంలో నిర్వహించిన జాయింట్ మీటింగ్ లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదాని,అంబానీలతో కుదుర్చుకున్న రూ.12400 ల కోట్ల సంగతి ఏంటో ప్రజల ముందు బహిర్గతం చేయాలన్నారు.జమిలీ ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం దీన్ని సీపీఐ(ఎం) పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో జమిలి ఎన్నికల బిల్లు పెట్టనుందన్నారు.జమలి ఎన్నికలు ఫెడరల్ వ్యవస్థను దెబ్బ తీయడమే కాకుండా రాష్ట్రాల స్వయం శక్తిని బలహీనపరుస్తుందన్నారు.ఎన్నికల ఖర్చులు తగ్గకపోను మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు.జమిలి ఎన్నికలు దేశ సంక్షేమానికి మంచివి కావన్నారు.ఒక రాష్ట్రంలో అవిశ్వాసంతో ప్రభుత్వం కూలిపోతే తిరిగి ఎన్నికలు నిర్వహించరా? అన్నారు.6 గ్యారంటీల పేరుతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా ఉత్సవాలు చేయడం లో అర్థం లేదన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలయ్యాయో ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే చెప్పతున్న ప్రజాసామ్య పరిరక్షణ ఏడవ గ్యారంటీ అమలు చేయడం లేదన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లకు కూల్చడం,రామగుండం అడవులు నరకడం, ప్రాజెక్టుల పేదల భూములు గుంజుకోవడం, గ్రూపు వన్ విద్యార్థుల అరెస్టు చేయడం ఆ ప్రజాస్వామ్యకం కాదా అని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా ఏమీ లేదన్నారు.ముఖ్యమంత్రిలు ఎక్కడికి పోతే అక్కడ సిపిఐ(ఎం) నాయకులన అరెస్టు చేయడంలో ఇద్దరూ ఒకటే అన్నారు.ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలు చేసి పాలించాలని కోరారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడితే సిపిఐ(ఎం) చూస్తూ ఊరుకోదన్నారు.ఈ విలేకరుల సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య,జూలకంటి రంగారెడ్డి,పోతినేని సుదర్శన్, బొంతల చంద్రారెడ్డి,జిల్లా కార్యదర్శి ఎండి జాంగిర్,రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ,బట్టుపల్లి అనురాధ, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మంగా నర్సింహులు,మాటూరు బాలరాజు,కల్లూరి మల్లేశం,దోనూరి నర్సిరెడ్డి,దాసరి పాండు,మేక అశోక్ రెడ్డి జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, ఎండి పాషా, మండల కార్యదర్శి గంగాదేవీ సైదులు, కార్యదర్శి గోషిక కరుణాకర్,జిల్లా డివైఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు పల్లె మధుకృష్ణ,గడ్డం వెంకటేష్ మండల నాయకులు రాగిరు కిష్టయ్య, తడక మోహన్,చింతల సుదర్శన్,పల్లె శివకుమార్,బోదాస్ వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.



# పెరుగు మజ్జిగైంది, గుడ్డు సైజ్ మారింది

**భువనగిరి, తెలంగాణ ముచ్చట్లు**

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ హాస్టల్ ను కలెక్టర్ హనుమంతరావు ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిన్న హాస్టల్ను సందర్శించిన ఆయన వంటగదిలో ఆహారపదార్థాలు, కూరగాయలు తనిఖీ చేశారు. శుచి, శుభ్రత, ఉండేలా నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందివ్వాలని హాస్టల్ నిర్వాహకులకు ఆదేశించారు.భువనగిరిలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రిన్సిపల్కు షోకాజ్ నోటీసులు జారీ :** అయితే 24 గంటలు గడవక ముందే ఈరోజు హాస్టల్ నిర్వాహకులు ఆహారంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. ఇవాళ మరోసారి తనిఖీకి వచ్చిన కలెక్టర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేర్ టేకర్ రమేష్ను అక్కడికక్కడే సస్పెండ్ చేశారు. ప్రిన్సిపల్కి షోకాజ్ నోటీసు జారీ చేశారు. మధ్యాహ్న భోజనంలో కొత్త మెనూ పాటించడం లేదని కలెక్టర్ గుర్తించారు. విద్యార్థులకి పెట్టే గుడ్లు సరిగా లేకపోవడం,విద్యార్థుల చేత పని చేయించడం, పెరుగుకు బదులు మజ్జిగ సరఫరా చేయడం, డైనింగ్ హాల్లో కొత్త మెనూ బోర్డు ఏర్పాటు చేయకపోవడం, డైనింగ్ హాల్ శుభ్రం లేకపోవడాన్ని కలెక్టర్ గుర్తించారు.

**హాస్టల్ కేర్ టేకర్ను సస్పెండ్ చేసిన కలెక్టర్ :** నిన్న విద్యార్థులకు పెరుగు వడ్డించగా.. ఈరోజు మజ్జిగగా ఎలా మారిందంటూ రమేష్ను నిలదీశారు. మెనూ ఏంటని అడగడగా సరిగా నీళ్లు నమిలారు. అధికారులు వరుస తనిఖీలు చేస్తున్నా నిర్వాహకులు అలసత్వం ప్రదర్శించడంపై మండిపడ్డారు. బాధ్యుడైన కేర్ టేకర్ రమేష్ను సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ హనుమంతరావు ఆదేశాలు జారీ చేశారు.

# అమ్మకు యాక్సిడెంట్ అని చెప్పి బాలిక కిడ్నాప్

**తెలంగాణ ముచ్చట్లు**

ఆంధ్రప్రదేశ్లోని గుంటూరు జిల్లా వెంగళరావునగర్లో బాలిక అపహరణం కలకలం రేపింది. ఆమె తల్లికి రోడ్డు ప్రమాదం జరిగిందని మాయమాటలు చెప్పి గుర్తు తెలియని దుండగులు బాలికను కారులో తీసుకెళ్లారు. విజయవాడ మీదుగా బాలికను తీసుకెళ్లేందుకు ముఠా ప్లాన్ వేసింది. విజయవాడ బస్టాండ్ సమీపంలో కారు ఆపి ముఠా సభ్యులు భోజనానికి వెళ్లారు.ఈ క్రమంలోనే కారు డోర్కు లాక్ పడకపోవడంతో సదరు బాలిక తప్పించుకుంది. విజయవాడ బస్టాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బందికి ఈ విషయాన్ని తెలియజేసింది. దీనిపై వెంటనే స్పందించి అప్రమత్తమైన ఆర్టీసీ సిబ్బంది కిడ్నాపర్ల నుంచి బాలికను సురక్షితంగా రక్షించారు. ఈ విషయం తెలుసుకున్న కిడ్నాపర్లు కారును అక్కడే వదిలిపెట్టి పరారయ్యారు. ఈ ఘటనపై ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక పోలీసులు కిడ్నాపర్లు వినియోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు.

**ముసుగులో వచ్చి శిశువును కిడ్నాప్ చేసిన గ్యాంగ్ :** కొద్ది రోజుల క్రితం ఇలాంటి ఘటనే సంగారెడ్డి జిల్లాలో జరిగింది. సంగారెడ్డి జిల్లా ఆసుపత్రిలో ఓ శిశువు అపహరణకు గురైంది. బాధితులు




కంప్లైంట్ మేరకు రంగంలోకి దిగిన పోలీసులు శిశువు కిడ్నాపైన 30 గంటల్లోనే కేసును ఛేదించి పసిబిడ్డను కాపాడగలిగారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పోలీసులు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా మనూరు మండలంలోని దుడికొండ గ్రామానికి చెందిన అబ్బాస్ అలీ భార్య నశిమా 5 కాన్పునకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. సిజేరియన్ ద్వారా ఆమె ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అయితే కొంత సమయానికే శిశువు అపహరణకు గురైంది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు పాపను హైదరాబాద్ లో గుర్తించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కెనడా రాజకీయాల్లో కుదుపు!



**కెనడా తెలంగాణ ముచ్చట్లు**

కెనడా రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. ఆ దేశ ఉప ప్రధాని, ఆర్థికశాఖ మంత్రి క్రిస్టియా ఫ్రీలాండ్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రధాని జస్టిన్ ట్రూడో కేబినెట్‌లో క్రిస్టియా ఫ్రీలాండ్ అత్యంత శక్తిమంతురాలిగా గుర్తింపు పొందారు. అలాంటి ఆమె, ట్రూడో ప్రజాదరణ కోల్పోతున్నారని ఆరోపించారు. అలాగే లిబరల్ పార్టీ సభ్యురాలిగా కొనసాగుతానని పేర్కొన్న ఆమె, తదుపరి ఎన్నికల్లో టొరంటో నుంచి మళ్లీ పోటీ చేస్తానన్నారు.'ప్రస్తుతం మన దేశం తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోంది. మరోవైపు అమెరికాకు నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ 25శాతం టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరిస్తున్నారు. అలాంటి ముప్పును మనం తీవ్రంగా పరిగణించాలి' అని క్రిస్టియా ఫ్రీలాండ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. గత కొన్ని వారాలుగా ఉత్తమ మార్గాల కోసం అన్వేషించామని, ఈ క్రమంలో ఇద్దరి (ట్రూడోతో) అభిప్రాయాలు కలవలేదని తెలిపారు. అయితే, ఆమె నిర్వహిస్తున్న ఆర్థిక శాఖను మారుస్తున్నట్లు ట్రూడో చెప్పిన నేపథ్యంలో అందుకు క్రిస్టియా, తన పదవికి రాజీనామా చేయడమే సరైందని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

**తొలిసారి ఎన్నిక**

2013లో క్రిస్టియా తొలిసారి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. అనంతరం అధికారం చేపట్టిన ట్రూడో కేబినెట్‌లో చేరారు. వాణిజ్యం, విదేశాంగ మంత్రిగా ఆమె పనిచేశారు. 2020 ఆగస్టు నుంచి ఆర్థికమంత్రిగా కొనసాగిన ఆమె అమెరికా, ఈయూలతో స్వేచ్ఛా వాణిజ్య చర్చలకు నాయకత్వం వహించారు. అయితే దేశ ఆర్థిక సవాళ్లకు సంబంధించిన విషయాలను పార్లమెంటుకు నివేదించనున్న కొన్ని గంటల్లోనే క్రిస్టియా తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం.

**సొంత పార్టీ నేతల విమర్శలు**

సరిహద్దులో వలసలు, డ్రగ్స్ అక్రమ రవాణాను కట్టడి చేయకుంటే కెనడాపై టారిఫ్‌లు విధిస్తామని ఇటీవల అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో విఫలమైతే తమను అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరాలని ట్రూడోకు చురకలు అంటించారు. అయినప్పటికీ ఇలాంటి వ్యవహారాల్లో జస్టిన్ ట్రూడో స్పందన సరిగ్గా లేదని ఆయన సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఇదే అంశంపై కొన్ని వారాలుగా ఉప ప్రధాని క్రిస్టియా ప్రధాని ట్రూడో మధ్య బేధాభిప్రాయాలు వచ్చినట్లు తెలుస్తోంది. తాజాగా ఆమె రాజీనామా లేఖలోనూ ఇవే అంశాలు ప్రస్తావించారు.



## ఫారెస్ట్ రూట్‌లో శబరిమల వెళ్తే స్పెషల్ దర్శనం

**కెరళ, తెలంగాణ ముచ్చట్లు**

శబరిమల అయ్యప్ప భక్తులకు గుడ్‌న్యూస్. అయ్యప్ప దర్శనం కోసం పులిమేడు, ఎరుమేలి అటవీ మార్గాల్లో కాలినడకన వెళ్లే యాత్రికులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ తెలిపారు. అటవీ మార్గంలో అయ్యప్ప ఆలయానికి వెళ్లే భక్తులకు ఫారెస్ట్ అధికారుల సహకారంతో ప్రత్యేక ట్యాగ్‌ను అందజేస్తామని పేర్కొన్నారు.

**'వారికి ప్రత్యేక ఏర్పాట్లు'**

"పంపా నుంచి స్వామి అయ్యప్పన్ రోడ్డు మీదుగా సన్నిధానానికి భక్తులు చేరుకుంటారు. నీలిమల మార్గంలో అయ్యప్ప దర్శనానికి వెళ్లేవారికి ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నాం. మరక్కూట్టం వద్ద ప్రత్యేక ట్యాగ్‌లు కలిగిన యాత్రికులు శరంకుతి మార్గం నుంచి కాకుండా నేరుగా చంద్రానందన్ రోడ్డు ద్వారా సన్నిధానంలోకి ప్రవేశించవచ్చు. పులిమేడు, ఎరుమేలి మీదుగా నిర్దేశిత అటవీ మార్గాల ద్వారా వచ్చే భక్తులకు ప్రత్యేక ట్యాగ్‌లను అందిస్తాం. ఆలయం వద్ద ఉన్న ప్రత్యేక క్యూలో ఈ ట్యాగ్‌ను ఉపయోగించవచ్చు. అటవీ మార్గం గుండా అయ్యప్ప దర్శనం కోసం వచ్చే యాత్రికులకు ప్రత్యేక ట్యాగ్‌లను జారీ చేసే బాధ్యత అటవీ శాఖదే" అని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ విలేకరుల సమావేశంలో వ్యాఖ్యానించారు.

**అయ్యప్పను దర్శించుకున్న తమిళనాడు మంత్రి**

తమిళనాడు దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు సోమవారం శబరిమల అయ్యప్పను దర్శించుకున్నారు. ఈ క్రమంలో అయ్యప్పకు ప్రత్యేక పూజలు చేశారు. మండలం మకరవిళక్కు ఉత్సవాల సందర్భంగా శబరిమల సన్నిధానంలో చేసిన ఏర్పాట్లను శేఖర్ బాబు కొనియాడారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనానికి అవి సరిపోతాయని వ్యాఖ్యానించారు. భక్తులకు కేరళ సర్కార్, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు కల్పిస్తున్న సౌకర్యాలు అభినందనీయమని తెలిపారు.దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద పుణ్యక్షేత్రాల్లో కేరళలోని శబరిమల అయ్యప్ప దేవాలయం ఒకటి. ఈ ఆలయానికి పలు రాష్ట్రాల నుంచి మండల పూజలు, మకరజ్యోతి సమయంలో లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. ఆ సమయంలో ప్రతిరోజూ 1,20,000 మందికి పైగా భక్తులు శబరిమలకు చేరుకుంటారని అంచనా. మండల పూజలు సందర్భంగా నవంబర్ 16న తెరుచుకున్న అయ్యప్ప ఆలయం, మకరజ్యోతి తర్వాత మూసివేస్తారు.



## జమిలి ఎన్నికల బిల్లులో కొత్త ట్విస్ట్

**తెలంగాణ ముచ్చట్లు**

'వన్ నేషన్ వన్ ఎలక్షన్' కోసం ప్రవేశపెట్టే బిల్లులు లోక్ సభ ముందుకు మంగళవారం రానున్నాయి. అయితే జమిలి ఎన్నికల కోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లులో లోక్ సభతో పాటు అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితులకు సంబంధించిన నిబంధన ఒకటి ఉంది. అదేంటంటే?

**129వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం**

సెక్షన్ 2 సబ్ క్లాజ్ 5 ప్రకారం లోక్‌సభతో పాటు ఏదైనా శాసనసభకు ఎన్నికలు నిర్వహించలేమని ఈసీ అభిప్రాయపడితే తర్వాత అసెంబ్లీలకు ఎన్నికలు జరపవచ్చు. శాసనసభ ఎన్నికలకు ఉత్తర్వులు ఇవ్వాలని ఈసీ రాష్ట్రపతికి సిఫార్సు చేయాలి. ఈ క్రమంలో రాష్ట్రపతి అసెంబ్లీ ఎన్నికల కోసం ఉత్తర్వులు జారీ చేయాలి.

**సవరించాల్సిన అధికరణలు**

అలాగే లోక్ సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు జమిలి ఎన్నికల అమలు కోసం రాజ్యాంగంలో కొత్తగా 82ఎ అధికరణాన్ని చేర్చాల్సి ఉంటుంది. పార్లమెంటు పదవీ కాలంలో మార్పు కోసం అధికరణం 83, అసెంబ్లీల పదవీ కాలం సవరణకు అధికరణం 172, ఎన్నికల నిబంధనల రూపకల్పన కోసం పార్లమెంటుకు అధికారం కల్పించే అధికరణం 327 సవరించాల్సి ఉంటుంది. అలాగే సార్వత్రిక ఎన్నికలు తర్వాత లోక్‌సభ మొదటి సమావేశం జరిగే తేదీపై రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేయాలి. ఆ నోటిఫికేషన్ తేదీని అపాయింటెడ్ డేట్ అంటారు. ఆ నిర్ణీత తేదీ నుంచి లోక్‌సభ పదవీకాలం ఐదేళ్లు ఉంటుంది.

**డిసెంబర్ 17న లోక్‌సభ ముందుకు**

'ఒకే దేశంఒకే ఎన్నిక' కు సంబంధించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా మరో బిల్లును కేంద్రం మంగళవారం లోక్ సభలో ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు ప్రభుత్వ అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం దీన్ని ఉభయసభల సంయుక్త కమిటీకి పంపించాలని కేంద్రం సిఫార్సు చేసే అవకాశాలున్నట్లు వెల్లడించాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ మంగళవారం ఈ బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు సదరు వర్గాలు తెలిపాయి.

**జేపీసీకి జమిలి బిల్లులు**

జమిలి ఎన్నికల నిర్వహణపై అనేక అనుమానాలు నెలకొన్నవేళ దీనిపై విస్తృత సంప్రదింపుల కోసం బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపించాలని స్పీకర్ ఓం బిర్లాను కేంద్రమంత్రి అభ్యర్థించనున్నారు. అనంతరం దీనిపై ప్యానెల్ కమిటీ ఏర్పాటుకు సభ్యులను ప్రతిపాదించాలని సభాపతి పార్టీలను కోరనున్నారు. సాయంత్రానికి కమిటీ సభ్యులను ప్రకటించే అవకాశం ఉంది.

**సంఖ్యాపరంగా కమిటీలో చోటు**

పార్లమెంట్‌లో పార్టీల సంఖ్యాబలం ఆధారంగా కమిటీలో వారికి చోటు దక్కుతుంది. అంటే అతిపెద్ద పార్టీ అయిన బీజేపీ నుంచి ఒక ఎంపీ కమిటీ ఛైర్మన్‌గా ఉంటారు. తొలుత ఈ ప్రతిపాదిత కమిటీకి 90 రోజుల సమయం కేటాయిస్తారు. అవసరాన్ని బట్టి ఆ తర్వాత దాన్ని పొడిగించొచ్చు.



## రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం

**తెలంగాణ ముచ్చట్లు**

ఆర్ఎస్ఎస్ మాజీ నేతలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నారని రాజ్యాంగ పరిషత్ చర్చలు చెబుతున్నాయని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శించారు. బీజేపీ మాయమాటలతో దేశ ప్రజలను మోసం చేస్తోందని, బదులుగా కాంగ్రెస్‌పై నిందలు వేస్తోందని ఆరోపించారు. జాతీయ జెండాను, అశోక్ చక్రాన్ని, రాజ్యాంగాన్ని ద్వేషించిన వారే నేడు రాజ్యాంగంపై పాఠాలు బోధిస్తున్నారని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని, అందుకే కుల గణనను వ్యతిరేకిస్తోందని వ్యాఖ్యానించారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా రాజ్యసభలో సోమవారం ప్రత్యేక చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై ఖర్గే విమర్శనాస్త్రాలు సంధించారు.

**'నేను మున్సిపాలిటీ స్కూల్లో- ఆమె జేఎన్‌యూలో'**

"నేను చదువుకుంది మున్సిపాలిటీ స్కూల్లో. ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో చదువుకున్నారు. హిందీ, ఇంగ్లీష్ బాగా మాట్లాడుతారు. ఆమె ఆర్థిక నిపుణురాలే కావొచ్చు. కానీ చర్యలు అస్సలు బాగోలేదు. అందరూ రాజ్యాంగం, దాని ప్రవేశికకు కట్టుబడి ఉండాలి. జన్ సంఘ్ ఒకప్పుడు మనుస్మృతి ఆధారంగా రాజ్యాంగాన్ని రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇదే ఆర్ఎస్ఎస్ ఉద్దేశం కూడా. త్రివర్ణ పతాకాన్ని, అశోకచక్రాన్ని, రాజ్యాంగాన్ని ద్వేషించినవాళ్లు మాకు పాఠాలు చెబుతున్నారు. రాజ్యాంగాన్ని అమలు చేసిన రోజున రాంలీలా మైదానంలో అంబేద్కర్, మహాత్మా గాంధీ, నెహ్రూ దిష్టిబొమ్మలను దహనం చేశారు. 1949లో ఆర్ఎస్ఎస్ నాయకులు భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించారు. అది మనుస్మృతి ఆధారంగా లేదని ఆ పని చేశారు" అని ఖర్గే వ్యాఖ్యానించారు.

**'రాజ్యాంగం పేదలకు అధికారం కల్పిస్తుంది'**

ఆర్ఎస్ఎస్‌లో ఇప్పటికీ మనుస్మృతి స్ఫూర్తే పాతుకుపోయిందని ఖర్గే విమర్శించారు. వారు త్రివర్ణ పతాకాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించలేదని పేర్కొన్నారు. అందుకే 2002 జనవరి 26న ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేయమని కోర్టు ఆదేశించిందని ఎద్దేవా చేశారు. రాజ్యాంగం పేదలకు అధికారం కల్పిస్తుందని, పాలనకు నైతిక మార్గదర్శకంగా పనిచేస్తుందని నొక్కి చెప్పారు."1971 యుద్ధంలో అప్పటి భారత ప్రధాని ఇందిరాగాంధీ కీలక పాత్ర పోషించారు. పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేసి బంగ్లాదేశ్‌కు విముక్తి కల్పించారు. లక్షలాది మంది పాక్ సైనికులను నిలువరించగలిగారు. బంగ్లాలోని మైనార్టీలను రక్షించడానికి కేంద్రం ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. దేశం కోసం పోరాడని వారికి స్వేచ్ఛ, రాజ్యాంగం విలువ ఎలా తెలుస్తుంది?. ప్రధాని మోదీ ప్రజల బ్యాంకు ఖాతాల్లోకి రూ.15 లక్షలు వేస్తానని చెప్పారు. ఇప్పటివరకు రాలేదు. మోదీ దేశ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారు. రాజ్యాంగాన్ని బలోపేతం చేసేందుకు గత 11 ఏళ్లలో ఏం చేశారో ప్రధాని మోదీ చెప్పాలి"

**-- మల్లికార్జున ఖర్గే, రాజ్యసభలో విపక్ష నేత**

**కాంగ్రెస్‌పై నిర్మల ఫైర్**

తనపై రాజ్యసభలో అసత్య ఆరోపణలు చేసినందుకు కాంగ్రెస్ జైరాం రమేశ్ క్షమాపణలు చెప్పాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ డిమాండ్ చేశారు. తాను రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రధాని మోదీని దొంగ అని సంబోధించిందని మండిపడ్డారు. ఇప్పుడు జీఎస్టీని గబ్బర్ సింగ్ ట్యాక్స్ అని మరో ఎంపీ అంటున్నారని, వస్తు సేవల పన్ను రాజ్యాంగ సవరణ సమయంలో కాంగ్రెస్ మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. అప్పుడు సభకు హాజరైన కాంగ్రెస్ ఎంపీలందరూ క్షమాపణలు చెప్పాలని కోరారు.



## 30గంటల మ్యూజిక్ మారథాన్

**తెలంగాణ ముచ్చట్లు**

బాలీవుడ్ షోమ్యాన్ రాజ్‌కపూర్ శత జయంతిని పురస్కరించుకుని జయపురలో సంగీత కార్యక్రమంతో ఆయనకు నివాళులర్పించారు. ఈ క్రమంలో నిర్విరామంగా 30 గంటలపాటు రాజ్‌కపూర్ సినిమాలోని పాటలు ఆలపించి జైపుర్ వాసులు, సంగీతకారులు 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకున్నారు.

**'240 మందికిపైగా గాయకులు, 450పాటలు'**

రాజ్‌కపూర్ 100వ జయంతి సందర్భంగా శనివారం జయపురలో 'ఆవారా హూన్' పేరిట సంగీత కార్యక్రమం జరిగింది. ఈ మ్యూజిక్ మారథాన్‌లో 260మందికి పైగా గాయకులు 450 కంటే ఎక్కువ పాటలను 30 గంటలు ఆలపించారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమైన మ్యూజిక్ మారథాన్, ఆదివారం రాత్రి 7వరకు కొనసాగింది. దీంతో ఈ సంగీత కార్యక్రమం గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది.

**'రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడానికి నియమ, నిబంధనలు'**

'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' అనేది యూఎస్ ఆధారిత సంస్థ. ఇది ప్రపంచంలోని విశిష్టమైన పనులను గుర్తిస్తుంది. జయపురలో రాజ్‌కపూర్‌ను స్మరించుకుంటూ 30 గంటల నిరంతర గాన మారథాన్ జరిగింది. ఇలా ఇంతసేపు పాటలు పాడడం ఇదే తొలిసారి. గతంలో కొందరు ప్రయత్నించినా ఇంతసేపు నిర్విరామంగా పాటలు పాడలేకపోయారు. ఈ రికార్డు సాధించడానికి అనేక నియమ, నిబంధనలు ఉంటాయి. వాటిని పాటించకుంటే ప్రపంచ రికార్డు వచ్చేది కాదు. రోటరీ క్లబ్ ఉడాన్, రోటరీ క్లబ్ క్రౌన్ కలిసి ఈ ఈవెంట్‌ను బాగా నిర్వహించాయి" అని గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఇండియా హెడ్ అలోక్ కుమార్ తెలిపారు.

**పాట పాడిన ఎమ్మెల్యే బల్ముకుంద్ ఆచార్య**

ఈ కార్యక్రమంలో హవా మహల్ ఎమ్మెల్యే బల్ముకుంద్ ఆచార్య పాల్గొన్నారు. ఆయన రాజ్‌కపూర్ ఫేమస్ సాంగ్ 'జీనా యహాన్ మర్నా యహాన్' అనే పాటను పాడి శ్రోతలను ఉర్రూతలూగించారు. ఈ పాట పదాలు శాశ్వతమైనవని కొనియాడారు. రాజ్‌కపూర్ జీవించి ఉన్నా, లేకపోయినా ఆయన పాటలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. రాజ్‌కపూర్ స్మారకార్థం జయపురలో 30 గంటలపాటు ఆయన పాటలతో సంగీత కార్యక్రమం నిర్వహించామని బల్ముకుంద్ ఆచార్య తెలిపారు. సంగీత ప్రియులు ఈ మ్యూజిక్ మారథాన్‌కు హాజరయ్యారని పేర్కొన్నారు. సంగీతం భగవంతుని స్వరమని, అది భగవంతుని కలవడానికి ఒక సాధనంగా ఉపయోగపడుతుందని కొనియాడారు.



## పడిపోయిన అదానీ, అంబానీ సంపద!

**తెలంగాణ ముచ్చట్లు**

వంద బిలియన్ డాలర్ల క్లబ్ నుంచి భారత కుబేరులు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీలు వైదొలిగారు. ఈ ఏడాది వారి సంపద భారీగా తగ్గడం వల్ల వారిద్దరు వంద బిలియన్ డాలర్ల క్లబ్ నుంచి ఔట్ అయినట్లు బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ వెల్లడించింది. ఈ ఏడాది చివర్లో వ్యాపారపరంగా వారు ఎదుర్కొంటున్న ఒడుదొడుకులే ఇందుకు కారణమని వెల్లడించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ సంపద ఈ ఏడాది జులైలో 120.8 బిలియన్ డాలర్ల ఉండగా డిసెంబర్ 13 నాటికి 96.7 బిలియన్ డాలర్లకు పడిపోయినట్లు బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. అటు అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ సంపద ఈ జూన్‌లో 122.3 బిలియన్ డాలర్లకు చేరగా డిసెంబర్ నాటికి ఏకంగా 40 బిలియన్లు తగ్గి 82.1 బిలియన్ డాలర్లకు పడిపోయినట్లు వెల్లడించింది.రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన రిటైల్, ఎనర్జీ విభాగాలు ఆశించిన మేర రాణించకపోవడం వల్ల అంబానీ వ్యక్తిగత సంపదలో క్షీణత కనిపించినట్లు బ్లూమ్‌బర్గ్ సంస్థ పేర్కొంది. సౌరశక్తి సరఫరా ఒప్పందాలు పొందేందుకు భారత్‌లో పెద్దఎత్తున లంచాలు ఇచ్చారని అదానీ గ్రూప్ అనుబంధ సంస్థలపై ఇటీవల అమెరికాలో కేసు నమోదైంది. ఆ వార్తలు వచ్చిన వెంటనే అదానీ సంస్థల షేర్లు భారీగా పతనమయ్యాయి. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ కూడా గతేడాది అదానీ సంస్థపై ఆరోపణలు చేసింది. కంపెనీల షేర్ల విలువను కృత్రిమంగా పెంచేందుకు అవకతవకలకు పాల్పడిందని, కంపెనీల ఖాతాల్లోనూ మోసాలు చేస్తోందని ఆరోపించింది. వీటిన్నింటి కారణంగా అదానీ సంపదలో తగ్గుదల నమోదైందని బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలు వచ్చే ఏడాది కూడా ఆ సంస్థ మార్కెట్ విలువపై ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనావేసింది. అయితే మొత్తంగా చూసుకుంటే భారత్‌లో ఉన్న సంపన్న వ్యక్తులు అభివృద్ధి చెందుతూనే ఉన్నట్లు బ్లూమ్‌బర్గ్ తెలిపింది. భారత సంపన్నుల్లోని మొదటి 20మంది ఈ ఏడాది ప్రారంభం నుంచి 67.3 బిలియన్ల డాలర్ల సంపదను ఆర్జించినట్లు పేర్కొంది. వీరిలో HCL టెక్నాలజీ వ్యవస్థాపకుడు శివ్ నాడర్ 10.8 బిలియన్ డాలర్లు, జిందాల్ గ్రూప్‌నకు చెందిన సావిత్రి జిందాల్ 10.1 బిలియన్ డాలర్లు ఆర్జించినట్లు వెల్లడించింది.



## నా డ్రీమ్ ప్రాజెక్ట్ ప్రతి భారతీయుడు గర్వపడేలా ఉంటుంది'

**ముంబాయి తెలంగాణ ముచ్చట్లు**

బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ 'మహాభారతం' ప్రాజెక్ట్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్ అని పేర్కొన్నారు. ఆ సినిమా విషయంలో తనపై ఎంతో బాధ్యత ఉందని తెలిపారు. ప్రతి భారతీయుడు గర్వపడేలా ఆ సినిమా తెరకెక్కించాలని అనుకుంటున్నట్లు చెప్పారు. ఈ మేరకు పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఆమిర్ ఈ కామెంట్స్ చేశారు.'నా డ్రీమ్ ప్రాజెక్ట్ మహాభారతం పట్ల నాపై చాలా బాధ్యత ఉంది. దాంతోపాటు భయం కూడా ఉంది. ఎక్కడా పొరపాటు లేకుండా భారీ స్థాయిలో ఈ ప్రాజెక్ట్ రూపొందించాలని అనుకుంటున్నాను. భారతీయులుగా ఈ కథ మన రక్తంలోనే ఉంది. కాబట్టి, ఇది నాపై ఎంతో బాధ్యత పెంచింది. అందుకే దీనిని సరైన పద్ధతిలో సక్రమంగా తీర్చిదిద్దాలనుకుంటున్నా. ఈ ప్రాజెక్ట్‌తో భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చూపించాలని అనుకుంటున్నా. ప్రతి భారతీయుడు గర్వపడేలా చేయాలనుకుంటున్నా. ఇది జరుగుతుందో? లేదో? తెలియదు. కానీ నేను మాత్రం దీని కోసం హార్డ్ వర్క్ చేయాలనుకుంటున్నా' అని ఆమిర్ ఖాన్ చెప్పారు. దాదాపు రూ.1000 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కే అవకాశం ఉన్నట్లు గతంలో బీటౌన్‌లో వార్తలు చక్కర్లు కొట్టాయి.కాగా, ఆయన నిర్మాతగా వ్యవహరించిన 'లపతా లేడీస్' సినిమా మంచి విజయం దక్కించుకుంది. డైరెక్టర్ కిరణ్ రావు దీనికి దర్శకత్వం వహించారు. 2025 ఆస్కార్ పోటీలకు ఈ సినిమా భారత్ నుంచి అధికారికంగా ఎంపికైంది. ఈ క్రమంలో ఆస్కార్ ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఆమిర్ ఖాన్ ఈ కామెంట్స్ చేశారు. అలాగే నిర్మాణ రంగంపై కూడా మాట్లాడారు.'భవిష్యత్తులో మరెన్నో చిత్రాలు నిర్మించాలనుంది. కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించాలని ఉంది. గొప్ప కథలను ప్రేక్షకులకు అందించాలనేదే నా ఆలోచన. నిర్మాతగా మారినప్పటికీ నటుడిగానూ సినిమాల్లో నటిస్తా. ప్రస్తుతం రెండు, మూడేళ్లకు ఒక సినిమా చేస్తున్నా. రానున్న రోజుల్లో సంవత్సరానికి కనీసం ఒక సినిమా చేయాలని అనుకుంటున్నా' అని అన్నారు.



## ఈ నెల 21 వరకు అసెంబ్లీ సమావేశాలు!

**తెలంగాణ ముచ్చట్లు**

అసెంబ్లీ సమావేశాలు ఇవాళ తిరిగి ప్రారంభం కానున్నాయి. ప్రశ్నోత్తరాల తర్వాత ప్రభుత్వం రెండు బిల్లుల్ని సభలో ప్రవేశ పెట్టనుంది. పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ జరగనుంది. అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశంపై నేడు జరిగే బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. శాసనసభ శీతాకాల సమావేశాలు ఈ నెల 9న వాయిదా పడగా, ఇవాల్టి నుంచి మళ్లీ మొదలు కానున్నాయి. తొమ్మిదో తేదీన సచివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించి అసెంబ్లీలో ప్రభుత్వం స్వల్పకాలిక చర్చ చేపట్టింది. ఆరోజు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సీఎం రేవంత్ రెడ్డి, అదానీ కలిసి ఉన్న టీ షర్టులు వేసుకుని రావడంతో అసెంబ్లీలోకి రానీకుండా పోలీసులు అడ్డుకున్నారు.

కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం సభ్యుల మధ్యనే తెలంగాణ తల్లిపై స్వల్పకాలిక చర్చ కొనసాగింది. ఆ తర్వాత ఇవాల్టికి ఉభయ సభలు వాయిదా పడ్డాయి. వారం తర్వాత పునర్ ప్రారంభమవుతున్న సమావేశాలు ఈ నెల 21 వరకు కొనసాగే అవకాశం ఉందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. సభ పని దినాలు, చర్చించాల్సిన అంశాలపై నేడు జరిగే బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. శాసనసభ మొదలు కాగానే గంటపాటు ప్రశ్నోత్తరాలు ఉంటాయి. ఆ తర్వాత ఇటీవల మృతి చెందిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు కొమిరెడ్డి జ్యోతి దేవి, ఊకె అబ్బయ్య, రామచంద్రారెడ్డికి సంతాపం ప్రకటిస్తారు.పర్యాటక విధానంపై చర్చ : అనంతరం శాసనసభలో క్రీడా విశ్వవిద్యాలయ బిల్లు, విశ్వవిద్యాలయాల సవరణ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెడుతుంది. ఈ శాఖలను చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా బిల్లుల్ని ప్రవేశపెట్టనున్నారు. బిల్లులు ప్రవేశపెట్టిన తర్వాత ఉభయ సభల్లో పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ చేపడతారు. రాష్ట్రంలో ఆకర్షణీయమైన స్థలాలు, ఆలయాలు ఉన్నాయి. అయినా ఆశించిన స్థాయిలో పర్యాటక అభివృద్ధి జరగలేదని ప్రభుత్వం భావిస్తోంది. ఈ అంశంపై ఇటీవల సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ నెలాఖరు నాటికి కొత్త పర్యాటక పాలసీని సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ చేపట్టనున్నారు.



# సంక్రాంతికి వస్తున్నాంలో క్లైమాక్స్ సర్‌ప్రైజ్ అతడే..!

వెంకటేష్ హీరోగా ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరిలు హీరోయిన్స్‌గా నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా 2025 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈసినిమా ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఈ సినిమా టీం నుంచి బ్యాక్ టు బ్యాక్ వీడియోలు వస్తున్నాయి. భారీ అంచనాలు ఉన్న ఈ సినిమాపై అంచనాలు పెంచే విధంగా మరో ఆసక్తికర వార్త ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో ఒక యంగ్ హీరో క్లైమాక్స్‌లో కనిపించబోతున్నాడు అంటూ యూనిట్ సభ్యుల ద్వారా సమాచారం అందుతోంది.ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమా క్లైమాక్స్‌లో యంగ్ హీరో కనిపించబోతున్నాడని, ఆయన చుట్టూ కామెడీ సన్నివేశాలు అల్లినట్లుగా యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ఆ యంగ్ హీరో కనిపించిన అయిదు పది నిమిషాలు నవ్వులు పూయించడం ఖాయం అనే అభిప్రాయంను వారు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆ హీరో ఎవరు అనే విషయాన్ని లీక్ చేయలేదు. విడుదల సమయంలో రివీల్ చేస్తారా లేదంటే విడుదల అయ్యేంత వరకు ఆ విషయాన్ని సస్పెన్స్‌గానే ఉంచుతారా అనే విషయంలో క్లారిటీ రావాలి అంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయాల్సిందే.నెల రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది అంటూ ఇటీవల కౌంట్ డౌన్ ప్రారంభించిన మేకర్స్ మరో పాటను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల రమణ గోగుల పాడిన గోదారి గట్టు పాటకు మంచి స్పందన దక్కింది. వెంకటేష్‌ను ప్రేక్షకులు ఎలా చూడాలి అనుకుంటున్నారో అలాంటి కథ, కథనంతో ఈ సినిమాను అనిల్ రావిపూడి రూపొందించారు అనే వార్తలు వస్తున్నాయి. మాజీ పోలీస్ ఆఫీసర్ పాత్రలో వెంకటేష్ కనిపించబోతున్నాడు అంటూ ఇప్పటికే యూనిట్ సభ్యులు విడుదల చేసిన పోస్టర్స్, టీజర్స్‌తో క్లారిటీ వచ్చింది.ఈ సినిమాలో వెంకటేష్ భార్య పాత్రలో ఐశ్వర్య రాజేష్ నటించగా, మీనాక్షి చౌదరి ఆయన ప్రియురాలి పాత్రలో కనిపించబోతుంది. మొత్తానికి వింటేజ్ వెంకటేష్‌ను చూడటంతో పాటు, సంక్రాంతికి ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌ను చూడబోతున్నాం అంటూ ఫ్యాన్స్‌తో పాటు ప్రతి ఒక్కరు చాలా నమ్మకంగా ఉన్నారు. ఈ సంక్రాంతికి రామ్ చరణ్, శంకర్‌ల గేమ్ ఛేంజర్ సినిమాతో పాటు బాలకృష్ణ, బాబీల 'డాకు మహారాజ్' సినిమాలు విడుదల కాబోతున్న విషయం తెల్సిందే. ఈ రెండు సినిమాలతో పాటు సంక్రాంతికి వస్తున్నాం సినిమా విడుదల కాబోతున్న నేపథ్యంలో అంచనాలు భారీగా ఉన్నాయి.

# బద్లా సీక్వెల్‌కు సన్నాహాలు



"ప్రతీసారి ప్రతీకారం తీర్చుకోవడం సరికాదు.. అలాగే ప్రతీసారి క్షమించడం కూడా సరైనది కాదు.." అంటూ ప్రేక్షకులను మెప్పించింది 'బద్లా' చిత్రం. 2019లో విడుదలై సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకున్న ఈ సినిమా సీక్వెల్ కోసం ప్రేక్షకులు ఎప్పటినుంచో ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే.

'ప్రతీసారి ప్రతీకారం తీర్చుకోవడం సరికాదు.. అలాగే ప్రతీసారి క్షమించడం కూడా సరైనది కాదు.." అంటూ ప్రేక్షకులను మెప్పించింది 'బద్లా' చిత్రం. 2019లో విడుదలై సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకున్న ఈ సినిమా సీక్వెల్ కోసం ప్రేక్షకులు ఎప్పటినుంచో ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు వారందరికీ ఓ తీపి కబురు వినిపించే ప్రయత్నాల్లో ఉంది చిత్రబృందం. తాజాగా ఈ సినిమాకు సీక్వెల్‌ను తెరకెక్కించే ఆలోచనల్లో ఉన్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో సుజయ్ ఘోష్ తెరకెక్కించిన ఈ చిత్రంలో తాప్సీ కథానాయిక. దీన్ని రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, అజూర్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి.

## sports స్పోర్ట్స్



# ప్లేఆఫ్స్‌లో దబంగ్ ఢిల్లీ

ప్రొ కబడ్డీ సీజన్-11లో దబంగ్ ఢిల్లీ ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లింది. సోమవారం ఆ జట్టు 47-25తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది. అషు మలిక్ (17) ఢిల్లీ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన ఢిల్లీ.. విరామ సమయానికి 26-9తో నిలిచింది. బ్రేక్ తర్వాతా అదే జోరు ప్రదర్శించి తేలిగ్గా నెగ్గింది. దీంతో 20 మ్యాచ్‌ల్లో 11 విజయాలతో ఢిల్లీ ముందంజ వేసింది. ప్లేఆఫ్స్ చేరడం ఆ జట్టుకు ఇది వరుసగా ఆరోసారి. హరియాణా స్టీలర్స్ ఇప్పటికే ప్లేఆఫ్స్ చేరింది. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 37-32తో పుణెరి పల్టాన్‌ను ఓడించింది. దేవాంక్ (11), అయాన్ (9) పట్నా విజయంలో కీలకపాత్ర పోషించారు.



# ఆ వ్యాఖ్యలతో నాకేం సంబంధం లేదు

ప్రస్తుతం జరుగుతున్న బోర్డర్-గావస్కర్ ట్రోఫీ గురించి సోషల్ మీడియాలో తన పేరు, ఫొటో దుర్వినియోగం కావడంపై భారత మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే స్పందించాడు. కొంతమంది సామాజిక మాధ్యమాల్లో తన ఫొటోను ఉపయోగించి తమకు తోచిన విధంగా వార్తలు రాయడాన్ని ఖండించాడు. అవన్నీ నకిలీ వార్తలని, వాటితో తనకేలాంటి సంబంధం లేదని క్లారిటీ ఇచ్చాడు. ప్రస్తుతం టీమ్‌ఇండియా ఐదు టెస్టుల సిరీస్ కోసం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం గబ్బా వేదికగా మూడో టెస్టు జరుగుతోంది. అయితే, కొన్ని రోజులుగా కొంతమంది సోషల్ మీడియాలో అనిల్ కుంబ్లే ఫొటోను ఉపయోగించి నకిలీ వార్తలను ప్రచారం చేస్తున్నారు. బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లీ వైఫల్యం, రోహిత్ శర్మ కెప్టెన్సీపై కుంబ్లే తీవ్ర విమర్శలు చేశాడని ఆ వార్తల సారాంశం. అవన్నీ అసత్య కథనాలని కుంబ్లే తాజాగా ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశాడు.'కొన్ని సోషల్ మీడియా ఖాతాలు నా ఫొటోని ఉపయోగిస్తూ కల్పిత వ్యాఖ్యలు నాకు ఆపాదిస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. ఆ ఖాతాలు, వాటిలో సమాచారంతో నాకేలాంటి సంబంధం లేదు. ఆ వ్యాఖ్యలు నేను చేయలేదు. ఇలాంటి వాటి విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నా. సోషల్ మీడియాలో చూసే ప్రతిదాన్ని నమ్మొద్దు. ఏదైనా సమాచారాన్ని షేర్ చేసే ముందు అది సరైనదో.. కాదో ధ్రువీకరించుకోండి. నా అధికారిక సోషల్ మీడియా ఛానల్స్ (అకౌంట్స్) నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రమే నమ్మండి' అని కుంబ్లే ఎక్స్‌లో రాసుకొచ్చాడు.ఇక, గబ్బా టెస్టు విషయానికొస్తే.. మ్యాచ్‌కు మూడో రోజు కూడా వరుణుడు పలుమార్లు ఆటంకం కలిగించాడు. దీంతో ఇవాళ 33 ఓవర్ల ఆట మాత్రమే సాగింది. ఆట ముగిసే సమయానికి భారత్ 51/4 స్కోరుతో నిలిచింది. క్రీజ్‌లో కేఎల్ రాహుల్ (33*), కెప్టెన్ రోహిత్ శర్మ (0*) ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ ఇంకా 394 పరుగులు వెనకబడి ఉంది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 445 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in